

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 09-03-2025 | సంపుటి - 21 | సంచిక - 318 | రూ : 4 | పేజీలు: 8




# ఆర్థిక శక్తిగా మహాలక్ష్మి

- కోటి మంది మహిళలకు రూ.లక్ష కోట్ల రుణం
- సంఘటితం.. సంస్థాగతం.. సాధికారత లక్ష్యం
- ఒకే గొడుగు కిందకి గ్రామీణ, పట్టణ సంఘాలు
- కొత్తగా కిశోర బాలికలు, వృద్ధులతో గ్రూపుల ఏర్పాటు
- ఇందిరమ్మ మహిళాశక్తి మిషన్-2025 విధానం
- నేడు మహిళాశక్తి సభలో ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్: తెలంగాణలో మహిళా స్వయం సహాయక సంఘాల అండతో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వ్యాపారంలో అదానీ, అంబానీలతో పోటీ పడేలా మహిళలను తీర్చిదిద్దుతున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే బాధ్యత తనదేనన్నారు. ఇందిరా మహిళాశక్తిని ప్రపంచానికి ఆదర్శంగా నిలుపుతామన్నారు. వచ్చే శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో 33% సీట్లు మహిళలకే ఇస్తామన్నారు. చేతివృత్తుల వారి ఉత్పత్తులకు పన్నులను మినహాయిస్తామని భరోసా ఇచ్చారు. టన్నెల్ కూలితే, పంటలు ఎండితే భారాస నేతలు తనను తిడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరా మహిళాశక్తి మిషన్2025 విధానాన్ని విడుదల చేశారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే సౌరవిద్యుత్ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఆర్టీసీకి అద్దెకిచ్చేందుకు మండల సమాఖ్యల కోసం కొనుగోలు చేసిన 50 బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం

తరువాయి 2లో

# మహిళలే సంపద సృష్టికర్తలు

- లక్ష మంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను శాసిస్తున్నవి డ్వాక్రా సంఘాలే
- ఐదారుగురు పిల్లల్ని కన్నా.. ప్రసూతి సెలవులు, ప్రయోజనాలు
- మహిళా దినోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- మార్కాపురం వేదికగా పలు ఒప్పందాలు.. గిన్నిస్ రికార్డు

ఒంగోలు, మార్కాపురం: 'ప్రపంచ వ్యాపారవేత్తలను ఏపీకి తీసుకొస్తాం. మీకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇప్పిస్తాం. ఇక్కడ తయారుచేసే ఉత్పత్తులకు విశ్వవ్యాప్తంగా మార్కెటింగ్ కల్పిస్తాం. రాష్ట్రంలో ఏడాదిలో లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడం నా లక్ష్యం. ఈ అవకాశాన్ని మీరంతా అందిపుచ్చుకోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. డ్వాక్రా మహిళలు తయారుచేసే ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్ కావాలని

తరువాయి 2లో





# నేను అత్యంత ధనవంతుడిని

- నా జీవిత ఖాతాలో కోట్లమంది మహిళల ఆశీర్వాదాలున్నాయి
- అవే నాకు బలం.. ప్రేరణ: మోదీ

నవసారి (గుజరాత్): ప్రపంచంలోనే తాను అత్యంత ధనవంతుడినని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ ఆశీస్సులే తనకు శక్తి, ప్రేరణ అని ఉద్ఘాటించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని నవసారి జిల్లాలో శనివారం జరిగిన కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. 'నేను అత్యంత ధనవంతుడినని వినగానే కొందరికి ఒళ్లు గగుర్పొడుస్తుంది. ధనవంతుడినని నేను అంటున్నది డబ్బుపరంగా కాదు.. నా ఖాతాలో కోట్లమంది మహిళల ఆశీర్వాదాలు ఉన్నాయి. అదే నాకు విలువైన సంపద, బలం, రక్షాకవచం' అని ఆయన చెప్పారు. మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. స్త్రీలపై నేరాలను

తరువాయి 2లో



## రాజకీయ వారసులను నిర్ణయించేది రాష్ట్ర ప్రజలే

- పాదయాత్ర నన్ను మార్చేసింది
- క్షేత్రస్థాయి సమస్యలను బాగా అర్థం చేసుకొనేలా చేసింది
- డీలిమిటేషన్ సహా ఏ సమస్య వచ్చినా కేంద్రంతో మాట్లాడి పరిష్కరించుకుంటాం
- ఇండియా టుడే కాంక్లేవ్‌లో మంత్రి నారా లోకేశ్

2లో

## వనాటుకు మారనున్న లలిత్ మోదీ మకాం

- భారత్ పౌరసత్వాన్ని వదులుకునేందుకు దరఖాస్తు
- 15 ఏళ్లుగా లండన్‌లో నివాసం
- ఐపీఎల్ నిధుల దుర్వినియోగం కేసులో విచారణను ఎదుర్కొంటున్న మాజీ బాస్



2లో

## ఎస్ఎల్‌బీసీ ప్రమాదం..

- మనుషుల ఆనవాళ్లను గుర్తించిన కేరళ జాగిలాలు

దోమలపెంట: నాగర్‌కర్నూల్ జిల్లాలో కూలిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సొరంగంలో గల్లం త్తైన వారిని గుర్తించడంలో

తరువాయి 2లో





# భారత్‌కు వ్యతిరేకంగా కుమ్మక్కు!

- చైనా, పాక్ సంబంధాలపై ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలు

దిల్లీ: భారత్‌కు వ్యతిరేకంగా చైనా, పాకిస్థాన్‌లు కుమ్మక్కవుతున్నాయని సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఆ రెండింటి మధ్య ఉన్న కుట్రపూరిత సంబంధాలున్నాయన్న వాస్తవాన్ని భారత్ తప్పక అంగీకరించాలన్నారు. ఈ మేరకు ఒక జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. రెండు వైపుల నుంచి దేశానికి ముప్పు పొంచి ఉందన్నారు. సైనిక సన్నద్ధత, సరిహద్దుల వెంబడి పరిస్థితులు, బంగ్లాదేశ్ అంశం తదితరాల గురించి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాల గురించి ప్రస్తావిస్తూ.. "ఉగ్రవాదానికి ఆ దేశం (పాక్)

తరువాయి 2లో

# రూ.59 కోట్ల చరాస్తులు.. రూ.11 కోట్ల స్థిరాస్తులు'

- కేసులేవీ లేవు
- అఫిడవిట్‌లో ప్రకటించిన కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి నాగబాబు
- అన్న చిరంజీవి వద్ద రూ.28 లక్షలు, తమ్ముడు పవన్ కల్యాణ్ వద్ద రూ.6 లక్షల అప్పు తీసుకున్నట్లు వెల్లడి

అమరావతి: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా.. జనసేన పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన కొణిదల నాగేంద్రరావు (నాగబాబు).. ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో తన ఆస్తులు, అప్పుల వివరాలను వెల్లడించారు. తనపై ఎలాంటి క్రిమినల్ కేసులూ లేవని స్పష్టం చేశారు. అఫిడవిట్‌లో ఆయన పేర్కొన్న వివరాల ప్రకారం.. చరాస్తులు

* మ్యూచువల్ ఫండ్స్/బాండ్లు రూ.55.37 కోట్లు
* చేతిలో నగదు రూ.21.81 లక్షలు
* బ్యాంకులో నిల్వ రూ.23.53 లక్షలు
* ఇతరులకు ఇచ్చిన అప్పులు రూ.1.03 కోట్లు

తరువాయి 2లో



# ఆర్థిక ప్రగతికి ఆడబిడ్డలే అండ

(మొదటిపేజీ తరువాయి)

సీఎం మాట్లాడుతూ... ''మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా పురోగమిస్తుంది. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసినప్పుడే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉండాలని... వాటి నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించాం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 1.30 కోట్ల జతల ఏకరూప దుస్తులను కుట్టే బాధ్యతను వారికే అప్పగించాం. మహిళా సంఘాల సమావేశాల కోసం ప్రతి జిల్లాకేంద్రంలో రూ.25 కోట్లతో ఇందిరా మహిళాశక్తి భవనాలను నిర్మిస్తున్నాం. సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్లను వారికి అప్పగించాం. వారితో 1000 విద్యుత్ బస్సులు కొనిపించి, ఆర్టీసీకి అందజేస్తాం. రాజకీయాల్లో మహిళలు రాణించి, సమాజానికి సేవ చేయాలి.

### * రైస్‌మిల్లులు, గోదాములూ మీకే

మిల్లుల్లో ధాన్యాన్ని మాయం చేస్తున్న వారికి బుద్ధి చెబుతాం. మున్ముందు ప్రతి మండలంలో మహిళలకు రైస్ మిల్లులు, గోదాములను నిర్మించే బాధ్యత అప్పగిస్తాం. ప్రభుత్వమే మీకు స్థలమిస్తుంది. రుణాలిస్తుంది. మీరే మిల్లులు, గోదాములను నిర్మించండి. ఐకేపీ కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మీరే మరాడించి రాష్ట్ర ప్రభుత్వానికి, ఎఫ్‌సీఐకి అందించండి. చేతివృత్తుల వారి ఉత్పత్తులకు పన్నులను తొలగించాలని ఉపముఖ్యమంత్రి భట్టిని కోరుతున్నా. వారి పెట్టుబడికి రుణసాయం అందిస్తాం. పాఠశాలలు, గురుకులాల్లోని విద్యార్థులకు పోషకాహారాన్ని మహిళా సంఘాల ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించాం. దీనిపై విధానాలను రూపొందించాలని సీఎస్, సెర్ప్ సీఈవోలను ఆదేశిస్తున్నా. వృద్ధ మహిళలకు అండగా ఉండేందుకు 65 ఏళ్ల వరకు వారిని స్వయం సహాయక సంఘాల్లో కొనసాగించాలని, ఆర్థిక నిర్వహణ తెలుసుకునేందుకు పదోతరగతి పాసైన ఆడపిల్లలను సంఘాల్లో చేర్చుకోవాలని ఆదేశించాం. ఆనాటి ఇందిరమ్మ శక్తి...... ఎన్టీఆర్ యుక్తి.. ఈ నాటి మీ రేవంతన్న స్ఫూర్తితో మీరు ముందుకెళ్లాలి. తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి.

### అలాంటి వారు బాగుపడరు

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో పైకప్పు కూలితే, పంటలు ఎండితే భారాస నేతలు అకారణంగా నన్ను తిడుతున్నారు. ప్రజలకు కష్టమొస్తే ఆదుకోవడానికి ప్రయత్నించాలి. మీకున్న అనుభవంతో సూచన చేయాలి. ఇలా సంబరపడేవారు బాగుపడినట్టు చరిత్రలో లేదు'' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, సురేఖ, పొన్నం తదితరులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి... రాష్ట్రంలోని 2,82,552 మహిళా స్వయం సహాయక సంఘాల కోసం రూ.22,794 కోట్ల చెక్కును విడుదల చేశారు. రుణ, ప్రమాద బీమాల కింద రూ.44.80 కోట్లను అందజేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథి రూపొందించిన 'ఓ మహిళ' అనే పాటను ఆవిష్కరించారు. అనంతరం పాటల రచయిత చరణ్‌కౌశిక్, గాయని మధుప్రియ తదితరులను సీఎం సత్కరించారు.

# మహిళలే సంపద సృష్టికర్తలు

(మొదటిపేజీ తరువాయి)

ఆకాంక్షించారు. మహిళలే సంపద సృష్టికర్తలని పేర్కొన్నారు. తాను పాతికేళ్ల క్రితం ఐటీని తీసుకొస్తే, నేడు తెలుగువారు వంద దేశాల్లో పనిచేస్తున్నారని గుర్తు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా మార్కాపురంలో శనివారం నిర్వహించిన వేడుకల్లో, బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పలు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆయా సంస్థలను సభికులకు పరిచయం చేశారు. మహిళలు, పిల్లల భద్రతకు శక్తి టీమ్స్‌ను ప్రారంభించారు.



### దూరదృష్టితో పిల్లల్ని కనండి

బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ, 'చైనాలో జనాభా తగ్గుతోంది. జపాన్‌లో వృద్ధులు పెరిగారు. యూరప్‌లోనూ ఇదే పరిస్థితి. ఇలాగైతే వృద్ధులను ఎవరు చూసుకోవాలి? వారి సంపదకు వారసులెవరు? అందుకే జనాభా గురించి ఆలోచించాల్సిన తరుణమిది. పోషణ భారం అవుతుందని ఒకప్పుడు నేనే ఎక్కువ మంది పిల్లల్ని కనొద్దని చెప్పాను. ఇప్పుడు దూరదృష్టితో దేశం, రాష్ట్రం, సమాజ మనుగడ కోసం ఎక్కువ మందిని కనాలని చెబుతున్నా. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' కింద ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తాం. ప్రభుత్వ ఉద్యోగినులు ఐదుగురు, ఆరుగురు పిల్లల్ని కన్నా.. ఆరు నెలల ప్రసూతి సెలవులు ఇస్తాం. అదనంగా ప్రయోజనాలూ అందిస్తాం' అని సీఎం ప్రకటించారు.

### ఇదీ డ్వాక్రా సంఘాల సత్తా

'దేశంలో ఎన్నో సంస్థలు కాలగర్భంలో కలిసిపోయినా, డ్వాక్రా సంఘాలు సవాళ్లను ఎదుర్కొని నేడు రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలను శాసిస్తున్నాయి. మొత్తంగా రూ.లక్ష కోట్ల అప్పు తీసుకునే స్థాయికి సంఘాలు ఎదిగాయి. గ్రామంలో చిన్నచిన్న వ్యాపారాలకు ఆర్థిక సాయమందిస్తాం. అరకు కాఫీకి అంతర్జాతీయ బ్రాండ్ తీసుకురావాలి. దాన్ని మరో స్టార్‌బక్స్‌లా మార్చాలి. నేను వ్యాపార అవకాశాలు సృష్టిస్తా. మహిళలు అందిపుచ్చుకుని సమర్థంగా నిర్వహించాలి. పాతికేళ్ల క్రితం మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటైన అలీప్ సంస్థను ప్రోత్సహించాను. ఇప్పుడది పది వేల మందికి ఉపాధి చూపుతోంది' అని చంద్రబాబు గుర్తుచేశారు.

# వనాటుకు మారనున్న లలిత్ మోదీ మకాం

దిల్లీ, లండన్: ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ అయిన ఐపీఎల్ వ్యవస్థాపకుడు, దాని నిర్వహణలో నిధుల దుర్వినియోగం ఆరోపణలను ఎదుర్కొంటున్న లలిత్ మోదీ.. పసిఫిక్ ద్వీప దేశమైన వనాటుకు మకాం మార్చేస్తున్నాడు. ఆ దేశానికి చెందిన గోల్డెన్ పాస్‌పోర్టును తీసుకున్నాడు. గత 15 ఏళ్లుగా లండన్‌లో తలదాచుకున్న అతడు.. వనాటు పౌరసత్వం తీసుకున్న నేపథ్యంలో తన భారత పాస్‌పోర్టును అప్పగించేందుకు లండన్‌లోని రాయబార కార్యాలయంలో ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. మనీ లాండరింగ్, పన్ను ఎగవేత ఆరోపణలు ఎదుర్కొంటున్న అతడు పాస్‌పోర్టును అప్పగించేందుకు దరఖాస్తు చేసుకున్న విషయాన్ని మన విదేశీ వ్యవహారాలశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం వెల్లడించారు. 'ఆయన దరఖాస్తు చేశాడు. దానిని నిబంధనల ప్రకారం అధికారులు పరిశీలిస్తున్నారు. అతడు వనాటు పౌరసత్వం తీసుకున్న విషయం తెలిసింది. అతడిపై కేసును చట్ట ప్రకారం కొనసాగిస్తాం' అని ఆయన వివరించారు.

### వనాటు ఎందుకు?

3 లక్షల పైచిలుకు పౌరులుండే వనాటు అతి చిన్న దేశం. మన కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి కంటే ఇది చిన్నది. సిటిజెన్‌షిప్ బై ఇన్వెస్ట్‌మెంట్ (పెట్టుబడి ద్వారా పౌరసత్వం సీబీఐ) పేరుతో ఈ దేశం గోల్డెన్ పాస్‌పోర్టు ద్వారా పౌరసత్వం ఇస్తుంది.

ఆస్ట్రేలియాలోని సిడ్నీ నుంచి వనాటుకు 3 గంటల విమాన ప్రయాణం ద్వారా చేరుకోవచ్చు.

ఈ దేశ పాస్‌పోర్టుతో 120 దేశాల్లో వీసా లేకుండా పర్యటించవచ్చు. వాటిలో బ్రిటన్, ఐరోపా దేశాలు ఉన్నాయి. అందుకే ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులు ఈ దేశానికి చెందిన గోల్డెన్ పాస్‌పోర్టు తీసుకుంటుంటారు.

ఈ పాస్‌పోర్టు అంత ఖరీదైనదేమీ కాదు. రూ.1.3 కోట్లు చెల్లిస్తే సులభంగా ఇస్తారు. పెద్దగా డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు. అదీ ఆన్‌లైన్‌లో పంపించినా చాలు. ఆ దేశంలో అడుగుపెట్టకుండానే పాస్‌పోర్టును తీసుకోవచ్చు. ఈ ప్రక్రియంతా నెల లోగా పూర్తవుతుంది. దీంతో ఈ దేశ పౌరసత్వానికి భారీ డిమాండు ఉంటుంది. వనాటు దేశ ఆదాయంలో 40 శాతం ఈ పాస్‌పోర్టుల ద్వారానే వస్తోంది. అత్యంత పేద దేశాల్లో ఒకటైన వనాటు.. 2021లో మిగులు బడ్జెట్‌ను సాధించిందంటే ఈ పాస్‌పోర్టులవల్లే. వనాటులో ఆదాయ పన్నుగానీ, కార్పొరేట్ పన్నుగానీ, సంపద పన్నుగానీ లేవు. క్రిప్టో కరెన్సీకి కేంద్రంగా ఉంది. దీంతో చాలా మంది భారతీయులకు ఇది స్వర్గధామంగా ఉంది. అందుకే గత రెండేళ్లలో 30 మంది ప్రవాస భారతీయులు ఇక్కడ పౌరసత్వం తీసుకున్నారు. మన కంటే అత్యధికంగా చైనీయులు పౌరసత్వం తీసుకుంటున్నారు.

అంతర్జాతీయ నేరగాళ్లు వనాటులో గోల్డెన్ పాస్‌పోర్టులు తీసుకుని ఐరోపా దేశాల్లోకి సులభంగా ప్రవేశిస్తున్నారు. నేరాలకు పాల్పడుతున్నారు.

వనాటుతో మన దేశానికి నేరస్థుల అప్పగింత ఒప్పందం లేనందున భారతీయ దర్యాప్తు సంస్థల నుంచి తప్పించుకోవడానికి లలిత్ మోదీ ఈ పాస్‌పోర్టును తీసుకుని ఉండవచ్చని తెలుస్తోంది.

# రాజకీయ వారసులను నిర్ణయించేది రాష్ట్ర ప్రజలే

దిల్లీ: యువగళం పాదయాత్ర తన ఆలోచనా ధోరణిని సమూలంగా మార్చేసిందని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. 'అమెరికా కార్నెగీమెలన్‌లో అండర్ గ్రాడ్యుయేషన్, స్టాన్‌ఫర్డ్‌లో ఎంబీఏ చేసినా.. పాదయాత్రతోనే ఎంతో తెలుసుకోగలిగాను. ప్రతి నియోజకవర్గంలో నడిచి, ప్రజలతో మాట్లాడటం ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలను ఆకళింపు చేసుకొన్నాను. తాత, తండ్రి ముఖ్యమంత్రులుగా చేసినా నన్ను నేను తెదేపా కార్యకర్తగానే చూసుకుంటా. కార్యకర్తలు, నాయకులు నేను సిద్ధమయ్యానని నమ్మితే అప్పుడు నేను సిద్ధంగా ఉంటాను. తమ నాయకుడెవరన్నదీ, రాజకీయ వారసులెవరన్నదీ ప్రజలే నిర్ణయించాలి తప్ప చంద్రబాబు కాదు. నేనెప్పుడూ రోడ్డులేని మార్గంలోనే నడిచాను. 1985 నుంచి ఒక్కసారి కూడా తెదేపా గెలవని నియోజకవర్గాన్ని ఎంచుకొని పోటీ చేశాను. 2019లో 5,300 ఓట్లతో ఓడిపోయినా అక్కడే ఉండి పోరాడి ఈసారి 91 వేల మెజారిటీతో గెలిచాను. మంత్రిగా చాలా కఠినమైన విద్యాశాఖను ఎంచుకున్నాను' అని చెప్పారు. శనివారం దిల్లీలో జరిగిన ఇండియాటుడే కాంక్లేవ్‌లో ప్రముఖ పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్.. పార్టీ, ప్రభుత్వం, వ్యక్తిగత జీవితంలో పలు అంశాలపై అడిగిన ప్రశ్నలకు లోకేశ్ సమాధానాలిచ్చారు.




### * సర్టిఫికెట్ల జారీ సవాల్ అని అప్పుడే తెలిసింది

ఒక బటన్ నొక్కితే ఆహారం, సరకులు, సినిమా టికెట్లు వస్తున్నప్పుడు ప్రభుత్వ సేవలు ఎందుకు రావని ప్రజలు పాదయాత్రలో వేసిన ప్రశ్నే ఇప్పుడు వాట్సప్ గవర్నెన్స్‌కు నాంది పలికింది. నేను పాదయాత్ర చేయకపోతే.. ప్రజలకు సర్టిఫికెట్ల జారీ ఇంత సవాల్‌గా ఉందని తెలుసుకోలేకపోయేవాణ్ని. ఒక వేదిక నుంచి 200కి పైగా సేవలు అందిస్తున్న అరుదైన ప్రభుత్వాల్లో మాది ఒకటి.

### చంద్రబాబే మా బలం

కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై, తెలంగాణకు హైదరాబాద్ ఉంటే.. ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబే ప్రధాన బలం. 17వ కేబినెట్ సమావేశం ముగిసిన వెంటనే ఆయన ఫైళ్లు క్లియర్ చేయడానికి ఏ మంత్రి ఎంత సమయం తీసుకుంటున్నారో రికార్డు ముందుపెట్టారు. తర్వాత ప్రతి మంత్రీ వేగంగా ఫైళ్లు క్లియర్ చేస్తున్నారు.

### నైపుణ్యగణన పెద్ద సవాలే

నైపుణ్య గణనతో పోలిస్తే కులగణనే సులువు. విభిన్న విభాగాల్లో ఉన్న నైపుణ్యాలను లెక్కించడం ఎలా అన్నది అతిపెద్ద సవాలని మంగళగిరిలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాతే అర్థమైంది. దీన్ని మరింతగా తీర్చిదిద్ది, రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తాం.

# నేను అత్యంత ధనవంతుడిని

(మొదటిపేజీ తరువాయి)

అరికట్టడానికి కఠిన చట్టాలను అమల్లోకి తీసుకొచ్చామని తెలిపారు. వలస పాలననాటి చట్టాలను తొలగించి, మహిళలకు సంబంధించిన నిబంధనలను భారతీయ న్యాయ సంహితలో మరింత బలోపేతం చేశామని చెప్పారు. తీవ్ర నేరాలకు పాల్పడిన నిందితులకు వేగంగా శిక్ష పడేందుకు దాదాపు 800 శీఘ్ర విచారణ న్యాయస్థానాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

### కుమారులనూ ప్రశ్నించాలి

కుమార్తెలు ఆలస్యంగా ఇంటికొస్తే సవాలక్ష ప్రశ్నలు వేసే తల్లిదండ్రులు, తమ కుమారులు ఆలస్యంగా వచ్చినా ప్రశ్నించాలని మోదీ సూచించారు. అప్పుడే మెరుగైన సమాజం రూపొందుతుందని అన్నారు. దేశంలో దాదాపు పది కోట్ల మంది మహిళలు 90 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలను నడుపుతున్నారని, 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమం కింద ఇప్పటికే దాదాపు 1.5 కోట్ల మంది మహిళలను లక్షాధికారులు చేశామని చెప్పారు. భారత ఆత్మ.. గ్రామాల్లో ఉందని మహాత్మా గాంధీ అనేవారని.. ఆ గ్రామాలకు ఆత్మ మహిళలన్నది తన భావన అని మోదీ పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక బృందాలకు రూ.450 కోట్ల ఆర్థిక సాయాన్ని ఆయన పంపిణీ చేశారు. వారంతా తమతమ వ్యాపారాలను ఆన్‌లైన్ ద్వారా కూడా నిర్వహించాలని సూచించారు. లఖ్‌పతి దీదీలు మాట్లాడుతూ తాము కొన్నేళ్ల తర్వాత కోటీశ్వరులై క్రోర్‌పతి దీదీ కార్యక్రమంలోనూ పాల్గొంటామని ఆశాభావం వ్యక్తంచేశారు. వారు చెబుతున్న విషయాలను మోదీ ఓ పుస్తకంలో రాసుకుంటూ కనిపించారు.

### మోదీకి రక్షణగా అంతా మహిళా పోలీసులే

కార్యక్రమంలో మోదీ భద్రతను మొత్తం మహిళా పోలీసులే పర్యవేక్షించడం గమనార్హం. కానిస్టేబుళ్ల నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ మహిళలే. ప్రధానికి రక్షణగా దాదాపు 2,500 మంది విధులు నిర్వర్తించారు. పురుష పోలీసులు పార్కింగ్ పర్యవేక్షణ, ట్రాఫిక్ విధులకు పరిమితమయ్యారు.

# భారత్‌కు వ్యతిరేకంగా కుమ్మక్కు!

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రబిందువు. అందువల్ల మనకు పొరుగున్న ఏ దేశంతోనైనా ఆ దేశం సన్నిహిత సంబంధాలు పెట్టుకోవడం మనకు ఆందోళనకరం. ఇందుకు కారణం.. ఆ దేశాన్ని కూడా ఉగ్రవాద చర్యలను ఉపయోగించుకునే అవకాశం ఉండటమే'' అని ద్వివేది పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌కు సంబంధించి ఇప్పుడే ఒక నిర్ణయానికి రావడం తొందరపాటవుతుందన్నారు. అయితే భారత్‌బంగ్లాదేశ్‌ల మధ్య సైనిక బంధం బలంగానే ఉందని చెప్పారు. చైనా, పాకిస్థాన్‌ల మధ్య వ్యూహాత్మక బంధం గురించి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ''వర్చువల్ వేదికలపై ఆ రెండు దేశాల మధ్య బంధం వందశాతంగా ఉంది. భౌతికంగా పరిశీలిస్తే.. చైనాలో తయారైన సైనిక ఉత్పత్తులను పాక్ వినియోగిస్తోంది. కుమ్మక్కుకు సంబంధించి నేడున్న పరిస్థితి ఇది. దీన్నిబట్టి రెండువైపుల నుంచి ఏకకాలంలో మనకు యుద్ధ ముప్పు ఉందనేది వాస్తవం'' అని ఆర్మీ చీఫ్ పేర్కొన్నారు.

# 'రూ.59 కోట్ల చరాస్తులు.. రూ.11 కోట్ల స్థిరాస్తులు'

(మొదటిపేజీ తరువాయి)

* బెంజ్ కారు రూ.67.28 లక్షలు
* హ్యుందయ్ కారు రూ.11.04 లక్షలు
* రూ.18.10 లక్షల విలువైన 226 గ్రాముల బంగారం తనవద్ద, తన భార్యవద్ద రూ.16.50 లక్షల విలువైన 55 క్యారట్ల వజ్రాలు, రూ.57.99 లక్షల విలువైన 724 గ్రాముల బంగారం, రూ.21.40 లక్షల విలువైన 20 కేజీల వెండి ఉన్నట్లు తెలిపారు.
* తనకు, తన భార్యకు కలిపి చరాస్తులు మొత్తం రూ.59.12 కోట్లు ఉన్నట్లు వెల్లడించారు.

### స్థిరాస్తులు

* రంగారెడ్డి జిల్లాలో రెండు వేర్వేరుచోట్ల ఉన్న 2.39 ఎకరాల భూమి విలువ రూ.3.55 కోట్లు
* మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రూ.32.80 లక్షల విలువైన 3.28 ఎకరాలు, అదే ప్రాంతంలో మరో సర్వే నంబరులో రూ.50 లక్షల విలువైన 5 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా టేకులాపల్లిలో రూ.53.50 లక్షల విలువైన 1.07 ఎకరాల భూములు
* హైదరాబాద్‌లోని మణికొండలో రూ.2.88 కోట్ల విలువైన 460 చదరపు అడుగుల రెసిడెన్షియల్ విల్లా
* మొత్తంగా రూ.11.20 కోట్ల విలువైన స్థిరాస్తులు

### అప్పులు

* రెండు బ్యాంకుల్లో గృహరుణ మొత్తం రూ.56.97 లక్షలు, కారు రుణం రూ.7,54,895. ఇవికాకుండా ఇతర వ్యక్తులు, సంస్థల నుంచి తీసుకున్నవన్నీ కలిపి రూ.1.64 కోట్ల అప్పులున్నాయని తెలిపారు.
* తన అన్న చిరంజీవి నుంచి రూ.28,48,871, తమ్ముడు పవన్ కల్యాణ్ నుంచి రూ.6.90 లక్షలు అప్పు తీసుకున్నట్లు వెల్లడించారు.

# ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదం.. మనుషుల ఆనవాళ్లను గుర్తించిన కేరళ జాగిలాలు

(మొదటిపేజీ తరువాయి)

కొంత పురోగతి లభించింది. ప్రమాదం జరిగిన 100 మీటర్ల దూరంలో డి2 పాయింట్‌లో మనుషుల ఆనవాళ్లను కేరళ జాగిలాలు గుర్తించినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో సిబ్బంది జాగ్రత్తగా మట్టిని తొలగిస్తున్నారు. గల్లంతైన వారిలో కొందరిని నేడు సాయంత్రానికి గుర్తించే అవకాశం ఉంది. ఆనవాళ్లు లభించడాన్ని ఇంకా అధికారులు ధ్రువీకరించలేదు.

# తితిదేలో ఆధార్ ఆథెంటికేషన్!




అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి దర్శనాలు, సేవలు, వసతులు తదితర టికెట్ల బుకింగుల్లో దుర్వినియోగం, దళారుల ప్రమేయాన్ని నిరోధించేందుకు, పారదర్శకతను పెంచేందుకు కూటమి ప్రభుత్వం ఆధార్ ఆథెంటికేషన్, ఈకేవైసీలను అమలు చేయనుంది. వాటి వినియోగానికి అనుమతినిస్తూ గతేడాది ఆగస్టు 5న కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్ మంత్రిత్వ శాఖ సమ్మతి తెలపగా... ఆ నోటిఫికేషన్‌ను దేవాదాయ శాఖ శనివారం గెజిట్‌లో ప్రచురించింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ ఉత్తర్వులు జారీచేశారు. దీనివల్ల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల గుర్తింపును పరిశీలించేందుకు, ఒకరి పేరుతో మరొకరు రాకుండా నిరోధించేందుకు, సేవలు పొందేటప్పుడు తనిఖీ ప్రక్రియ క్రమబద్ధీకరణకు వీలవుతుంది. భక్తుల ఆధార్ ఆథెంటికేషన్ అనుమతి కోసం గతేడాది జులైలో దేవాదాయ శాఖకు తితిదే ఈవో లేఖ రాశారు. దేవాదాయ శాఖ ఆ లేఖను కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఆగస్టులో కేంద్రం నుంచి అనుమతి లభించింది. దానిపై నవంబరు 18న తితిదే బోర్డు తీర్మానం చేసింది. అందుకు అనుగుణంగా ఇప్పుడు నోటిఫికేషన్‌ను గెజిట్‌లో ప్రచురించారు.

## సింగరేణిలో నూతన బొగ్గు బావులు ప్రారంభించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం

*** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు సూర్య వంశీ శుక్లాల్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్రం సింగరేణిలో నూతన బొగ్గు బావులు ప్రారంభించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు సూర్య వంశీ శుక్లాల్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు దాని అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టియుసి కార్మికులకు ఇచ్చిన గ్యారంటీల హామీలను కోల్ బెల్ట్ ప్రాంత సింగరేణి11 ఏరియా లలోప్రజలు కాంగ్రెస్ పార్టీకి 8 మంది ఎమ్మెల్యేలు ఎంపీలను ఇచ్చినప్పటికీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ రోజు స్వయాన కోల్బెల్ ప్రాంతం పర్యటించి కార్మిక ప్రజలను కాంగ్రెస్ పార్టీ మేని పోస్ట్ అనేక హామీలు ఇచ్చి 15 నెలలు గడుస్తున్న పాలనలో ఈరోజు వరకు ఏ ఒక్క హామీలు కూడా అమలు చేయలేదు నమ్మించి మోసం చేయడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమా యావత్ ప్రజానీకానికి ఇప్పుడిప్పుడే అర్థమవుతుందన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేట్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస పనికి కనీస వేతనాలు అమలు జరగడం లేదన్నారు కేంద్ర ప్రభుత్వం కోల్ ఇండియా బొగ్గు గను లో కాంట్రాక్ట్ కార్మికులను హై పవర్ కమిటీ వేతనాలు చెల్లిస్తున్నారు. హామీలను అమలు చేయలేని ముఖ్యమంత్రి రేవతి రెడ్డి కేంద్ర బొగ్గు గ నుల శాఖ మంత్రి జి, కిషన్ రెడ్డిని విమర్శించుడు హాస్యాస్పదంగా ఉందన్నారు. మాయా మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గాడిద గుడ్డు మాటలు మాట్లాడుతున్నారు ప్రపంచంలో ఎక్కడైనా గాడిద గుడ్డు పెట్టంగా నేనైతే వినలేదు చూడలేదు మన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాడిద గుడ్డు పెట్టంగా చూసినట్టున్నారని ఎద్దేవా చేశారు.

## కోటి ఉమెన్స్ కాలేజీకి చాకలి ఐలమ్మ నామకరణం హర్షణీయం

*** కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడు భాను**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:మహిళల దినోత్సవం సందర్భంగా కోటి ఉమెన్స్ కాలేజీకి శంకుస్థాపన చేసి, తెలంగాణ వీరనారి, రజక జాతి పోరాట యోధురాలు చాకలి ఐలమ్మగా నామకరణం హర్షణీయమని అఖిలభారత రజక సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మిడిదొడ్డి భాను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చాకలి ఐలమ్మగా నామకరణం చేయడం చారిత్రాత్మకత నిర్ణయమని, ఇంత గొప్ప నిర్ణయం తీసుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు రజక జాతి తరుపున, అఖిల భారత రజక సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజులలో రజక జాతి అభ్యున్నతి కోసం రజకులకు ఈ ప్రభుత్వం తోడ్పడాలని కోరారు.

## రాజపేటలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





రాజాపేట, ప్రజా స్ఫూర్తి : మహిళలందరూ అన్ని రంగాలలో ముందుండాలని బిఆరెస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ కోరారు రాజపేట గ్రామంలో టిఆర్ఎస్ పార్టీఆధ్వర్యంలోమహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శాలువాతో సత్కరిస్తూ స్త్రీ, అమ్మగా, చెల్లిగా, అక్కగా ఇలా ఎన్నో పాత్రలు సమర్థవంతంగా పోషిస్తూ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంకేతిక రంగాలలో సమాన అవకాశాలు సాధిస్తూ అన్ని రంగాలలో పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆరెస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి , గోపగాని బాలమణి , బూర్గు భాగ్యమ్మ , ఆడెపు రమాదేవి , మడవతు రాణి , చల్మడి రేవతి లకు చేనేత శాలువాలతో సత్కరించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుకుల జశ్వంత్, కాకల ఉపేందర్, పట్టణ అధ్యక్షులు బెడిదే వీరేశం, అంకతి సుదర్శన్,కాకర్ల ఉపేందర్,బూర్గు నర్సిరెడ్డి,మరవతు లక్ష్మణ్,కాకర్ల కమలాకర్,మొగిలి నాగరాజు, సర్పంచ్ రాజు, పెద్దలు, రాజు నాయకులు పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని రాజపేట గ్రామపంచాయతీ పరిధిలో మహిళల సమక్షంలో మహిళ గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళల యొక్క ప్రాముఖ్యత రాజకీయపరంగా మహిళల యొక్క విధానాలను అదేవిధంగా వారి ఆర్థిక స్థితిగతులను సమాన పనికి సమాన వేతనం అయినటువంటి మహిళా మణులకు భారత రాజ్యాంగం ప్రకారంగా చేకూర్చే లబ్ధిలను వారికి మహిళా పథకాలకు సంబంధించిన వివరాలను వారికి ఎదురయ్యే సమస్యల గురించి గ్రామపంచాయతీ పరిధిలో మహిళ సమక్షంలో చర్చించారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓఆవుల కిషన్ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, రాజపేట గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నిజాంపేట్ మహిళలు నిజాంపేట్ మాజీ సర్పంచ్ ఎన్ ఎం సి మాజీ కార్పొరేటర్ తేజ శ్రీనివాస్ రెడ్డి ని కలిసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, సరిత, ధనలక్ష్మి, నవ్య దేవి ,సత్యవతి, అరుణ కుమారి , రమ (మెడిటేషన్ టీచర్), వరలక్ష్మి, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు ప్రతి రంగంలో రాణిస్తున్నారు

*** ప్రముఖ ఎముకల వైద్య నిపుణురాలు సుధారాణి**







జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో పురుషులతో సమా నంగా మహిళలు ప్రతి రంగంలో రాణిస్తూ ఔన్నత్యాన్ని చాటిచెపుతున్నారని ప్రముఖ ఎముకల వైద్య నిపుణురాలు సుధారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ భగత్సింగ్ మార్గ్ లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆమెతోపాటు,మేడ్చల్ జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షులు,పాఠశాల చైర్మన్,కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు,అకాడమిక్ డైరెక్టర్ బిర్రు శోభారాణి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఎముకల వైద్య నిపుణురాలు సుధారాణి మాట్లాడుతూ మహిళలు వారిలోని ప్రతిభను వెలికి తీస్తే ప్రపంచాన్ని శాసించగలరన్నారు. స్త్రీ శక్తి ముందు ఏ శక్తి నిలబడలేదని మహిళలు వంటింటికే పరిమితం కాకుండా బాహ్య ప్రపంచంలోని మంచి చెడులను తెలుసు కోవాలని సూచించారు. సహనానికి మరో పేరు స్త్రీ మూర్తి అని తెలిపారు. పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే వారిలో ఉన్న ఆత్మస్థైర్యమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తూ రంగాలలో రాణించిన మహిళల విశిష్టత తెలుపుతున్నామన్నారు. పాఠశాలలో విద్యార్థుల తల్లులకు నిర్వహించిన పలు పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మేమెంటో అందజేస్తూ శాలువాతో సన్మానించి అభినందించారు. విద్యార్థుల తల్లులతోపాటు,పాఠశాల మహిళా అధ్యాపక బృందాన్ని 300 మందిని పాఠశాల యాజమాన్యం మెమెంటో,శాలువాలతో ఘనంగా సన్మానిస్తూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలలో మహిళలు స్టెప్పులు వేసి సందడి చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్నే ఫాతిమా,ప్రశాంతి,కృష్ణవేణి, మహేశ్వరి,సాజిత, ఉపాధ్యాయులు,విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## నారాయణ పాఠశాలలో వేడుకగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

*** మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి -- ఏ.జి.ఎం యోగ రాంకీ**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నెహ్రూనగర్ నారాయణ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం అత్యంత వేడుకగా నిర్వహించారు, ఈ సందర్భంగా 'వనితకు వందనం' కార్యక్రమం ద్వారా విద్యార్థుల తల్లులకు, మహిళా ఉపాధ్యాయులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, పిల్లలతో తల్లులకు, మహిళా ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానాలు చేసి, బహుమతులు అందచేశారు. ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కారక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం నారాయణ పాఠశాలల ఏజీఎం యోగ రాంకీ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం అని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే అది సాధ్యమవుతుందని, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి అని, తమ నారాయణ విద్యాసంస్థలో మహిళా ఉపాధ్యాయులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని. ఈ రోజు మహిళా దినోత్సవం సందర్భంగా "వనితకు వందనం" కార్యక్రమం అద్భుతంగా నిర్వహించిన పాల్వంచ బ్రాంచ్ సిబ్బందిని, పాల్గొన్న తల్లులను అభినందించారు, విద్యార్థుల ఉత్సాహాన్ని ప్రశంసించారు. ప్రత్యేక అతిథిగా ఖమ్మం జోన్ ఈ కిడ్స్ కోఆర్డినేటర్ నీలిమ మాట్లాడుతూ మార్చి 8న మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారని, మహిళలు చదువుకుంటే తమ ఇంటిని తీర్చి దిద్దుకోగలరని, మహిళ సాధికారత కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మరింత కష్టపడదామని పిలుపునిస్తూ మహిళామణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈటెక్నో ఏ.డి రామకృష్ణ, ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ రుచిత శ్రీ, ఇంచార్జి మల్లేష్, సురేష్, అనూష, శ్వేతా, దీప్తి, కీర్తి, ప్రీతి, రహీమా, కళ్యాణి, శైలజ, శ్రీలత, ఉషా, అలియా, అఫ్రీన్, జాహ్నవి, నాగరాణి, అనూష, నిఖిల, కావ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అనుచరులకు గుండాయిజం, రౌడీయిజాన్ని నేర్పిస్తున్న కేకే

**- ప్రభుత్వ అసమర్థతపై ప్రజల్లోకి తీసుకెళ్తే దూషణలు**

**- బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహా రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి తన అనుచరులకు గుండాయిజం, రౌడీయిజాన్ని నేర్పిస్తున్నారని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహా రెడ్డి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి అన్నారు. శనివారం ముస్తాబాద్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలైనా నియోజకవర్గానికి రూపాయి తీసుకు వచ్చి అభివృద్ధి పరచడం చేతగాని కేకే మహేందర్ రెడ్డి ఒక్కో మండలానికి పది మంది తన అనుచరులతో సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్‌ను ఇష్టం వచ్చినట్లు తిట్టిసున్నారని ఆరోపించారు. సామాజిక మాధ్యమాలలో కేకే మహేందర్ రెడ్డి అనుచరులు ఇష్టం వచ్చినట్టుగా మాజీ మంత్రి కేటీఆర్‌పైన అసభ్య పదజాలాన్ని వాడుతున్న తీరు హేయమైనదని అన్నారు. ప్రభుత్వ అసమర్థతను ప్రజల్లోకి తీసుకపోతున్న దళిత బిడ్డ, సర్పంచ్‌ల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మాట్ల మధును ఫోన్ ద్వారా బెదిరింపులకు గురి చేయించడమే కాకుండా, ప్రెస్ మీట్‌లు ఏర్పాటు చేయించి వ్యక్తిగతంగా టార్గెట్ చేయిస్తూ అనుచరులకు రౌడీయిజం, గుండాయిజాన్ని కేకే మహేందర్ రెడ్డి నేర్పిస్తున్నారని వారు తీరును తీవ్రంగా ఖండిరచారు. ప్రభుత్వ అసమర్థతను ప్రజల్లోకి తీసుకుపోతున్నటువంటి బిఆర్ఎస్ నాయకులపై రాత్రి సమయంలో, అర్ధరాత్రి సమయాన కూడా వాట్సప్ గ్రూపుల్లో వ్యక్తిగత దూషణలు చేయడాన్ని గ్రూపుల్లో ఉన్న యువత, ప్రజలు కూడా సహించడం లేదని, పోలీసు అధికారులు ఇలాంటి వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముక్క మల్లయ్య, బండి ఎల్లం, ఎండి.జహంగీర్, పల్లె సత్యం, పుల్లూరి శ్రీనివాస్, చిప్పలపల్లి ఆంజనేయులు, బాలచంద్రం, సంజీవ్, తుమ్మనపల్లి శేఖర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఘన సన్మానం



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : మహిళలు స్వయం సమృద్ధి సాధించడం వల్ల సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెరుగుతూ పెరుగుతాయని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ అడ్మిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కోర్టు మాజీ చైర్మన్ జస్టిస్ వామన్ రావు అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులకు న్యాయమూర్తి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి అని నేటి మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అంతరిక్షానికి సైతం వెళ్లి వస్తున్నారని అన్నారు. అమెరికా చికాగో రాష్ట్రానికి చెందిన సంస్థ సుబేదర్ అమీర్ అలీ ఖాన్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఫరూక్ అలీ ఖాన్ మాట్లాడుతూ మహిళలకు భద్రత, రక్షణ లేకపోవడం ఆందోళనకు గురి చేస్తుందని, ఇంతటి వివక్షలోనూ ధైర్యంగా నిలబడి పురుషులతో సమానంగా ఉన్నత స్థాయికి ఎదిగి గుర్తింపు తెచ్చుకుంటున్నారని అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ మహిళల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, ఆర్థిక, దేశాభివృద్ధికి మహిళలు తోడ్పాటు నందిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా విద్యావేత్త ఇట్టా ఉదయశ్రీ, యాస్మిన్ కౌసర్, డాక్టర్ ధనంజయ్ హైకోర్టు న్యాయవాది, విద్యావేత్త డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కుమారి ఏ.సృజన గౌడ్, కుమారి రేసు వైష్ణవి, కుమారి తహసీన్ సభ లకు జస్టిస్ వామాన్ రావు శాలువాతో ఘనంగా సన్మానించారు.

## మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

*** కొత్తపల్లి నారాయణ ప్రజాపతి**



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని లోక్ జనశక్తి పార్టీ కిసాన్ సెల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి నారాయణ ప్రజాపతి అన్నారు.శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి నిత్యం ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డా.సుమతీ ని కొత్తపల్లి నారాయణ శాలువాతో సన్మానించి, అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.మహిళలు స్వయం, సమృద్ధి సాధించడం వల్ల సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెరుగుతుందన్నారు. మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండల్ ప్రజాపతి, అంజన్న, ఏస్. రాములు, టి.శ్రీనివాస్, మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

*** కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భం గా 4 వ డివిజన్ నందు జరిగిన ఉచిత హెల్త్ క్యాంపునకు , కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి , కోలన్ రాజశేఖర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ డివిజన్ ప్రజలకు జి సురేంద్ర కుమార్ యాదవ్ వారి మిత్రబృందం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యసేవలను ప్రశంసిస్తూ,అందరూ ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఇలాంటి ప్రజా సేవలకు తమ మద్దత్తు యెల్ల వేళలు ఉంటుందని తెలియ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వెల్ఫేర్ సభ్యులు యుగందర్ రెడ్డి, సుబ్బు, శివ, వెంకట్రావ్, చంద్ర, పవన్, మహమూద్, మహేష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రామారావు, తదితరులను అభినందించారు.

*** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి పాటుపడాలి**

*** వివేకానంద డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు**

శేరిలింగంపల్లి, , (ప్రజాస్ఫూర్తి ) :కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను వట్టి మాటలతో మోసం చేయడం మానుకొని మహిళా అభ్యున్నతికి పాటుపడాలని వివేకానంద డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద డివిజన్ లో గల మాధవరం నగర్ కమ్యూనిటీ హాల్ లో ఆశా వర్కర్లు , అంగన్వాడి టీచర్స్ స్థానిక మహిళలతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వంలో ఆశ వర్కర్లకు పోస్టింగ్ ఇస్తూ వారి వేతవాలని పెంచారన్నారు. అంగన్వాడి టీచర్స్ , ఆయాల వేతనాలు పెంచారని తెలియజేస్తూ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆశా వర్కర్లకు నిశ్చిత వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలను కోటీశ్వరులు చేస్తామన్నారు. ప్రతి మహిళకు 2500 , మహిళ విద్యార్థులకి స్కూటీలు ఇస్తామని ఇచ్చిన హామీలను ఈ మహిళా దినోత్సవ సందర్భంగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మందకృష్ణ మాదిక లేఖ



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు అన్ని రకాల ఉద్యోగ నియామక పరీక్షల ఫలితాలు నిలిపివేయాలని లేఖలో పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ కోసం చట్టం చేస్తామని చెప్పి మరోవైపు గ్రూప్స్ ఫలితాల వెల్లడి తేదీలను ప్రకటించడం సరైంది కాదన్నారు. దీంతో ఎస్సీలకు మరోసారి అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# సమిష్టి ఉద్యమాలతోనే మహిళా చట్టాలు, హక్కులు కాపాడుకోవాలి

**సముచిత స్థానం కోసం మహిళాలోకం ఉద్యమించాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సమిష్టి ఉద్యమాలతోనే మహిళలకు, మహిళా చట్టాలు, హక్కులకు పరిరక్షించుకోవాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా సమితి ఆద్వర్యంలో చుంచుపల్లి మండల సిపిఐ కార్యాలయం రజబ్ అలీ భవన్లో శనివారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ ను కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటైన మహిళా సదస్సులో సాబీర్ పాషా మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో నాటి నుంచి నేటి వరకు పాలకులు మహిళల అభ్యున్నతికి చేసింది శూన్యమన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని అనాదిగా పోరాడుతున్నా నేటికి అమలుకు నోచుకోవడం లేదన్నారు. రోజురోజుకు మహిళలపూ దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా వీటిని అరికట్టేందుకు ఉన్న చట్టాలను ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. భ్రూణ హత్యలు, ఆడపిల్లల అమ్మకాలు, హింస, వివక్షత వంటి దుశ్చర్యలను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాజంలో స్త్రీకి సంపూర్ణ గౌరవం దక్కినపుడు, చట్టాలను పకడ్బందీగా అమలు చేసినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, ఆదిశగా ప్రభుత్వాల చర్యలు చేట్టాలని లేనిపక్షంలో మహిళల ఆగ్రహాన్ని చవిచూడకతప్పదని హెచ్చరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని చాలా దేశాల్లో శ్రామిక మహిళల పోరాట దినంగా జరుపుకుంటారని గుర్తు చేశారు. అన్యాయానికి గురవుతున్న మహళలను చేరదీసి వారికి దక్కేవరకు మహిళా సమాఖ్య కృషి చేయాలనీ సూచించారు. అనంతరం వివిధరంగాల్లో సేవలందిస్తున్న పలువురు మహిళా ప్రముఖులను మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి ప్రోత్సహించారు. అనంతరం దిశ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పిఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన ఉత్సవాల్లో పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, సిపిఐ జిల్లా నాయకులూ సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, సమాఖ్య జిల్లా నాయకులు బారిగేలా సంపూర్ణ, రత్న కుమారి, మామిడాల ధనలక్ష్మి, కూరపాటి విజయలక్ష్మి, మునిగడప పద్మ, మేదిని లక్ష్మి, ధారా లక్ష్మి, భాగ్యలక్ష్మి, నిర్మల, గోనె మణి, పల్నాటి వీణ, షహీన్, షమీన, పోలమూరి ధనలక్ష్మి, శాంతి, కైసర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆలయాల కాంపౌండ్ వాల్స్ కూలగొట్టకుండా సీఎం , హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్తా

*** మల్కాజ్గిరి ఎంపి ఈటెల రాజేందర్**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ఆలయాల కాంపౌండ్ వాల్స్ కూలగొట్టకుండా సీఎం దృష్టికి , హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి కూల్చివేత నోటీసులను రద్దు చేసేలా చర్యలు తీసుకుంటానని మల్కాజ్గిరి ఎంపి ఈటెల రాజేందర్ అన్నారు. జగద్గిరిగుట్ట కొండపై వెలిసిన 16 ఆలయాల కాంపౌండ్ వాళ్లకు కూల్చివేస్తామని చెప్పి హైడ్రా , కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో నోటీసులు ఇవ్వడం జరిగింది. ఈ యొక్క విషయాన్ని ఆయా సంఘాలు కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ కి తెలియజేయగా వారు స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో స్పందించిన ఆయన శనివారం జగద్గిరి గుట్ట కొండపై వెలసిన కన్యకా పరమేశ్వరి టెంపుల్ ఆవరణలో అన్ని సంఘాలు వారు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ కాంపౌండ్ వాళ్ళు కూలగొట్టకుండా సీఎం దృష్టికి హైడ్రా కమిషనర్ దృష్టి తీసుకెళ్తానన్నారు. హిందూ దేవాలయాల ప్రహరి గోడలు కూల్చడం మంచిది కాదని అన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని వారు ప్రభుత్వాన్ని హైడ్రా కమిషన్ ను హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పున్నా రెడ్డి, వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, డైరెక్టర్ వేణు. రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిఅరకల సుధా , సురేష్ రెడ్డి ,మహేందర్ , పరుశురాం , హనుమంత్ చారి, ప్రవీణ్ గుప్త , రమేష్ గుప్తా , శంకర్ గుప్తా , మల్లికార్జున్ , సత్యనారాయణ యాదవ్ , ఆలయ కమిటీ , కుల సంఘం అధ్యక్షులు, బిజెపి నాయకులు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## జీడిమెట్ల పోలీస్ స్టేషన్లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జీడిమెట్ల ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేష్ పాల్గొని పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బందిని శాలువాతో మెమెండో తో సత్కరించారు. అనంతరం హౌస్ కీపింగ్ మహిళలకు చీరలు బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల పట్ల గౌరవంగా మెదలాలని ప్రతి పురుషుడు మహిళలను గౌరవించిన రోజు సమాజంలో శాంతి విరాజిల్లుతుందన్నారు. తల్లిగా భార్యగా చెల్లిగా కూతురుగా ఉంటూ ఎన్నో రకాల విధులు నిర్వహిస్తున్నటువంటి మహిళను గౌరవించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

## కల్యాణ లక్ష్మి సృష్టి కర్త తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కే.సీ.ఆర్

*** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : కల్యాణ లక్ష్మి సృష్టి కర్త తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కే.సీ.ఆర్ అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్‌రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ లోని గుడ్ విల్ హోటల్ చౌరస్తాలో శనివారం ఆయన జీహెచ్ ఎంసీ మహిళా కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా స్నేహ మోడల్ స్కూల్ లో కరస్పాండెంట్ ఎమ్ రాజు ఆధ్వర్యంలో స్కూల్ ఉపాధ్యాయురాలులతో, ఎల్లమ్మ బండ లోని యుపిహెచ్సి హాస్పిటల్ లో మహిళా స్టాఫ్ తో కలిసి కేక్ కట్ చేసి బహుమతులు అందజేశారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించి మహిళా శక్తిని చాటాలి

*** టీవి సీరియల్యాక్టర్లు శ్రీవాణి, నవీనా యాట, ప్రత్యుషలు**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : మహిళలు అన్ని రంగాలలో రాణించి మహిళా శక్తిని చాటాలని టీవి సీరియల్యాక్టర్లు శ్రీవాణి, నవీనా యాట, ప్రత్యుషలు అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్ పురికాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వారు పాల్గొని విద్యార్థుల తల్లుల చే ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలందరికి అంతర్జాతీయ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో ముందుంటున్నారన్నారు. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తాము పాల్గొన్నడం చాలా సంతోషంగా ఉందన్నారు.వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ సి.హెచ్.నర్సింహులు గౌడ్ మాట్లాడుతూ పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో పోటీ పడుతున్నారన్నారు. ప్రతి యేడు మహిళ దినోత్సవం వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. అనంతరం మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో రేణుక,











పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సాయి, ప్రిన్సిపల్ శిల్ప, సంజయ్ పురి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు

# మహిళలు రాణించాలంటే చదువుకోవాలి: సీఎం

హైదరాబాద్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న రాజీవ్‌గాంధీ కలల్ని.. మహిళా వర్సిటీ విద్యార్థులు నిజం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో రూ.550 కోట్ల విలువైన నూతన భవన నిర్మాణాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనులకు సీఎం.. శంకుస్థాపనలు చేశారు. ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే సందర్భం



వస్తుందని, అందులో మీ ప్రాతినిధ్యం ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. మహిళలకు అవకాశం ఇస్తే తమ చిత్తశుద్ధిని నిరూపించుకుని ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ యూనివర్సిటీలో చదువుకోవడం ఇక్కడి విద్యార్థుల అదృష్టమని, మీ అన్నగా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకాన్ని అమలు చేస్తున్నానన్న సీఎం రేవంత్ రెడ్డి.. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించి వారికి పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగించామని వివరించారు. ఆడబిడ్డలు వంటింటి కుందేళ్లు కాదని.. వారు వ్యాపారవేత్తలుగా రాణిస్తారన్న భావనతో ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అదానీ, అంబానీలతో మహిళలు పోటీపడేలా కార్యాచరణ తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు విశ్వవిద్యాలయంలో దర్బార్ హాల్‌ను సీఎం సందర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు.

## కుటుంబాన్ని చిదిమేసిన కారు ప్రమాదం..
# కాలువలో మృతదేహాలు వెలికితీత



వరంగల్: జిల్లాలో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. స్వగ్రామానికి బయలుదేరిన ఓ కుటుంబాన్ని మార్గ మధ్యలోనే మృత్యువు కాటేసింది. ఈ ఘటనలో తండ్రి, కుమార్తె, కుమారుడు మృతి చెందగా, భార్య ప్రాణాలతో బయటపడింది. వివరాల్లో వెళితే.. వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లికి చెందిన ప్రవీణ్ కుటుంబంతో సహా హనుమకొండలో ఉంటున్నారు. శనివారం స్వగ్రామానికి వెళ్లేందుకు భార్య, పిల్లలతో కలిసి కారులో బయలుదేరారు. సంగెం మండలం తీగరాజుపల్లి వద్దకు రాగానే ప్రవీణ్‌కు ఛాతీలో నొప్పి వచ్చింది. దీంతో వరంగల్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుందామని వెనుదిరిగారు. యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఎస్ఆర్ఎస్‌పీ కాల్వలో పడింది. కాల్వలో కొట్టుకుపోతున్న కృష్ణవేణిని స్థానికులు గమనించి రక్షించారు. సాయివర్ధన్ (2) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్ (34), కుమార్తె చైత్రసాయి (4) గల్లంతయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గించి గాలింపు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల సాయంతో కారుతో పాటు గల్లంతైన ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. ఘటనా స్థలిలో కుమారుడు సాయివర్ధన్ మృతదేహాన్ని హత్తుకుని కృష్ణవేణి రోధిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. సంతోషంగా స్వగ్రామానికి వెళ్తోన్న కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం చిన్నాభిన్నం చేయడంతో ప్రవీణ్ స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

## కరీంనగర్ నుంచి తిరుపతికి
# రోజూ రైలు నడపండి

* **అశ్వినీ వైష్ణవ్‌కు మంత్రి పొన్నం లేఖ**



హైదరాబాద్: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని కరీంనగర్ నుంచి రోజూ తిరుపతికి రైలు నడిపేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి ఆయన లేఖ రాశారు. ''ప్రస్తుతం కరీంనగర్ నుంచి వారానికి రెండు సార్లు (గురువారం, ఆదివారం) మాత్రమే తిరుపతికి రైలు వెళ్తోంది. అదే రైలు తిరుపతి నుంచి కరీంనగర్‌కు బుధ, శనివారాల్లో తిరిగి బయలుదేరుతుంది. యూపీఏ హయాంలో నేను ఎంపీగా ఉన్నప్పుడు ఈ రైలును ఉత్తర తెలంగాణ ప్రజలు తిరుపతి వెళ్లడానికి వీలుగా, సులభతరంగా ఉండేలా అందుబాటులోకి తీసుకొచ్చాం. ఉత్తర తెలంగాణ ప్రాంతాల నుంచి ప్రస్తుతం తిరుమలకు వెళ్లే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ రైలు ప్రతిరోజూ నడిచేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం ప్రభుత్వాన్ని గత పదేళ్లుగా కోరుతున్నాను. ప్రయాణికుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని నిత్యం కరీంనగర్ నుంచి తిరుపతికి రైలు నడిచేలా చర్యలు తీసుకోండి'' అని లేఖలో పేర్కొన్నారు.

## తెలంగాణ ప్రయోజనాల విషయంలో
# కాంగ్రెస్ మాకు చెప్పాల్సిన అవసరం లేదు

**: కిషన్‌రెడ్డి**

హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) గురించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించామని.. ఫైనాన్స్‌కు సంబంధించిన ట్రైపార్టీ అగ్రిమెంట్ జరగాల్సి ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని గడ్కరీకి విజ్ఞప్తి చేశామన్నారు. ఈ మేరకు భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ''కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో 10 జాతీయ రహదారులను పూర్తి చేశాం. పార్లమెంట్ సమావేశాల అనంతరం ఈ 10 జాతీయ రహదారులను ప్రారంభిస్తాం. ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వస్తానని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంపై గడ్కరీతో చర్చించాం. ఉత్తర భాగం భూ సేకరణకు సంబంధించి 50 శాతం వ్యయాన్ని కేంద్రం భరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఫ్లైఓవర్ల కింద భూసేకరణ పూర్తి చేయాలి. అలా చేస్తేనే వాటి కింద రోడ్డు వేయడానికి ఆస్కారం ఉంటుంది. ఆరు ప్రాంతాల్లో భూ సేకరణ



పూర్తికాకపోవడంతో అంబర్‌పేట ఫ్లైఓవర్ కింది భాగం పూర్తి కాలేదు. హైదరాబాద్ పుణే మార్గంలో బీహెచ్ఈఎల్ వద్ద (జాతీయ రహదారి 65) ఫ్లైఓవర్ పూర్తి అయ్యింది. ఈ ఫ్లైఓవర్ వద్ద సిగ్నల్ ఫ్రీగా వెళ్లొచ్చు. పారిశ్రామిక అవసరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జాతీయ రహదారి 61 (17 కి.మీ), ఎన్‌హెచ్ 65 (22 కి.మీ.) పూర్తి అయ్యింది. జనగాం దుద్దెడ మార్గంలో భూసేకరణ పూర్తి చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూసేకరణ చేసి ఇస్తే.. అంతే త్వరగా రోడ్డు పూర్తి చేస్తాం. ఖమ్మం విజయవాడ మధ్య వెంకటాయపల్లి నుంచి బ్రాహ్మణపల్లి వరకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తెలంగాణ ప్రయోజనాల గురించి కాంగ్రెస్ పార్టీ మాకు చెప్పాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ స్వలాభం కోసం అనవసర ఆరోపణలు చేస్తోంది. తెలంగాణలో ఓట్లు, జనాభా తగ్గినా.. ఒక్క పార్లమెంట్ సీటు తగ్గదు. తమిళనాడు సీఎం స్టాలిన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంబద్ధంగా మాట్లాడుతున్నారు. హిందీ భాషను ఎవరిపై బలవంతంగా రుద్దడం లేదు. తప్పుడు ప్రచారాలతో దేశానికి, ప్రజలకు ద్రోహం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాక ముందు లిఖితపూర్వకంగా అనేక హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీలకు అతీగతీ లేదు. అధికారంలోకి వచ్చాక కొత్త ప్రాజెక్టులు ముందు వేసుకున్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నారు. కోచ్ ఫ్యాక్టరీ బడ్జెట్ అనుకున్న దానికంటే ఎక్కువ అయ్యింది. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం వేగంగా జరుగుతోంది. వచ్చే సంవత్సరం నుంచి ఉత్పత్తి ప్రారంభమవుతుంది. కాంగ్రెస్ మంత్రులు వరంగల్ వెళ్లి చూసి రావాలి'' అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజాభవన్‌లో కొనసాగుతున్న తెలంగాణ ఎంపీల సమావేశం

హైదరాబాద్: ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన తెలంగాణ ఎంపీల సమావేశం కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ హాజరయ్యారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఇందులో చర్చిస్తున్నారు. ఈ సమావేశానికి భాజపా, భారాస ఎంపీలు గైర్హాజరయ్యారు. శనివారం సమావేశానికి రావాలని తెలంగాణ రాష్ట్ర ఎంపీలకు.. శుక్రవారం భట్టి విక్రమార్క ఆహ్వానం పలికారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను ఆయన ప్రత్యేకంగా ఆహ్వానించారు. అయితే ఇప్పటికే నియోజకవర్గాల్లో ఖరారైన కార్యక్రమాలు



ఉండటంతో తాము రాలేమని భట్టికి కిషన్‌రెడ్డి లేఖ రాసిన విషయం తెలిసిందే.

# దిల్లీ మహిళలకు భాజపా సర్కారు శుభవార్త

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మహిళా సమృద్ధి యోజనను త్వరలోనే అమలు చేస్తామని దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా పేర్కొన్నారు. ఇందులో భాగంగా అర్హులైన మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. ఇందుకు సంబంధించి రూ.5100 కోట్లను కేటాయించేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. ''ఎన్నికల మేనిఫెస్టో హామీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దిల్లీలో పేద మహిళలకు ఆర్థిక సాయం పథకాన్ని ఆమోదించింది. ఈ పథకం అమలును పర్యవేక్షించేందుకు తన నేతృత్వంలో ఓ కమిటీ ఏర్పాటు చేశాం'' అని ముఖ్యమంత్రి రేఖా గుప్తా పేర్కొన్నారు. ఇందులో అశీష్ సూద్, పర్వేశ్ వర్మ, కపిల్ మిశ్రా వంటి సీనియర్ మంత్రులు కూడా ఉన్నారని చెప్పారు. ఈ పథకం కింద పేర్ల నమోదు కోసం ప్రత్యేకంగా వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. దిల్లీ



మహిళలకు ఆర్థిక సాయం పథకం ఆమోదం పొందిన విషయాన్ని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా వెల్లడించారు. ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం అందజేస్తామని భాజపా ప్రచారం చేసింది. ఆమ్‌ఆద్మీ పార్టీ నెలకు రూ.2100 ఇస్తామని చెప్పగా.. భాజపా మాత్రం మరో నాలుగు వందలు పెంచింది. దీంతోపాటు పలు వ్యూహాలతో ముందుకెళ్లిన కాషాయ పార్టీ.. 70 అసెంబ్లీ స్థానాలకు గాను 48చోట్ల విజయం సాధించి అధికారం చేపట్టిన సంగతి తెలిసిందే.

# జోర్డాన్ సైనికుల కాల్పుల్లో మరణించిన కేరళవాసి జాబ్ స్కామ్ బాధితుడు!

దిల్లీ: గత నెలలో అక్రమంగా ఇజ్రాయెల్ (Israel)లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తుండగా జోర్డాన్‌ఇజ్రాయెల్ సరిహద్దులో జరిగిన కాల్పుల్లో కేరళవాసి థామస్ గాబ్రియెల్ (47) మృతి చెందిన విషయం తెలిసిందే. దర్యాప్తులో అతడికి సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతడు ఒక జాబ్‌స్కామ్ బాధితుడని.. నెలకు రూ.3.5 లక్షల జీతం వస్తుందని ఆశ చూపి గాబ్రియెల్‌ను, అతడి బంధువు ఎడిసన్ ఛార్లెస్‌ను ఓ ఏజెంట్ జోర్డాన్‌కు తీసుకెళ్లినట్లు అధికారులు పేర్కొన్నారు. అంతకుముందు వారిరువురూ ఆటో నడుపుతూ.. వారి కుటుంబాలను పోషించుకునేవారని అన్నారు. భారత్ నుంచి బయలుదేరే ముందు వారు ఏజెంట్‌కు రూ.2,10,000 చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు. ఫిబ్రవరి 10న టూరిస్ట్ వీసాపై జోర్డాన్‌కు చేరుకున్న తర్వాత అదనంగా మరో రూ.52వేలు ఇచ్చారని.. అయితే అక్కడ ఉద్యోగాలు లేవని.. సరిహద్దు దాటి ఇజ్రాయెల్‌లోకి ప్రవేశిస్తే ఉపాధి దొరుకుతుందని చెప్పి ఏజెంట్లు వారిని అక్రమ చొరబాటుకు ప్రోత్సహించినట్లు గుర్తించామన్నారు. ఈక్రమంలోనే వారు అక్రమంగా ఇజ్రాయెల్‌లోకి ప్రవేశిస్తుండగా సైనికులు కాల్పులు జరపడంతో గాబ్రియెల్ మృతిచెందగా.. అతడి బంధువు ఎడిసన్ ఛార్లెస్‌కు గాయాలైనట్లు తెలిపారు.

# ఐఆర్‌సీటీసీతో జతకట్టిన స్విగ్గీ..

20 రాష్ట్రాల్లో సేవలు షురూ



**న్యూఢిల్లీ:** భారతదేశంలో రైలు ప్రయాణం అనేది చౌకైన ప్రజారవాణా సాధనంగా ఉంది. అయితే ఈ రైలు ప్రయాణంలో ఆహారం అనేది చాలా సమస్యగా మారుతుంది. అయితే తాజాగా స్విగ్గీ ఫుడ్ సర్వీస్‌ను 100 స్టేషన్లకు విస్తరించడం వల్ల ప్రయాణీకులకు ఎక్కువ సౌలభ్యం కలుగుతుందని స్విగ్గీ ఫుడ్ మార్కెట్‌ప్లేస్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలూ అన్నారు. ప్రయాణీకులు స్విగ్గీలో ఉన్న దాదాపు 60,000 కంటే ఎక్కువ రెస్టారెంట్ బ్రాండ్‌ల ద్వారా వారు ఉన్న ఏరియాకు అనుగుణంగా ఆర్డర్ చేసుకోవచ్చు. స్విగ్గీ సీట్ గ్యారెంటీ డెలివరీ సర్వీస్ ద్వారా వినియోగదారులు తమకు నచ్చిన స్టేషన్‌లో తమ ఆహారాన్ని ముందస్తుగా ఆర్డర్ చేసుకోవచ్చు. స్విగ్గీ యాప్‌లో "ట్రైన్" అని శోధించి, ఆహారాన్ని డెలివరీ చేసే వారి ప్రయాణ ప్రణాళికలోని అన్ని స్టేషన్‌లను యాక్సెస్ చేయడానికి రైలు పీఎన్ఆర్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది.

రైలు ప్రయాణీకులకు ఇబ్బంది లేని భోజన అనుభవాన్ని అందించడానికి స్విగ్గీ రైలులో ఆహారం ఆర్డర్‌ల కోసం హామీ ఇచ్చేలా బ్రోచర్‌ను విడుదల చేసింది. ప్రతి భోజనంతో పాటు ఒక చెంచా, ఫోర్క్, టిష్యూ పేపర్‌ను పర్యావరణ అనుకూలమైన పర్సులో చక్కగా ప్యాక్ చేసి అందించనున్నారు. రైళ్లలో ఆహారాన్ని అందించడానికి మార్చి 2024లో స్విగ్గీ ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ)తో చేతులు కలిపింది. గత సంవత్సరం స్విగ్గీ కేవలం 60 సెకన్ల హాల్ట్‌తో రైళ్లలో 35,000 ఆర్డర్‌లను డెలివరీ చేసింది. దాదాపు 54,000 మంది ప్రయాణికులు ఒకే ట్రిప్‌లో మల్టీ మీల్స్ ఆర్డర్ చేశారు. విజయవాడ జంక్షన్ గత సంవత్సరంలో అత్యధిక ఆర్డర్‌లను నమోదు చేసింది. తరువాత నెల్లూరు, సికింద్రాబాద్ జంక్షన్, కాట్పాడి జంక్షన్ ఉన్నాయి. ముఖ్యంగా కళ్యాణ్ జంక్షన్‌లో ప్రయాణికులు అతిపెద్ద ఆర్డర్ అంటే ఓ ఆర్డర్‌లో 41 బర్గర్‌లను ఆర్డర్ చేశారు.

సాధారణ రైలు వంటకాలతో పాటు ప్రయాణీకులు టిబెటన్ బేక్డ్ చీజీ మోమోలు, మెక్సికన్ మష్‌రూమ్స్, చీజ్ క్యాసాడిల్లాలు, లెబనీస్ క్లాసిక్ పెప్పీ చికెన్ షావర్మాతో సహా విభిన్న వంటకాలను రైలు నుంచే ఆర్డర్ చేసుకోవచ్చు. రాబోయే నెలల్లో స్విగ్గీ దేశవ్యాప్తంగా మరిన్ని స్టేషన్లకు తన పరిధిని విస్తరిస్తుందని స్విగ్గీ ప్రతినిధులు చెబుతున్నారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో జొమాటో తన తాజా ఆఫర్ 'జొమాటో ట్రైన్ ఫుడ్ డెలివరీ' పేరుతో ఐఆర్‌సీటీసీతో జతకడుతున్నట్లు ప్రకటించింది.

## పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త..

ఇకపై వివరాల అప్‌డేట్ మరింత సులభం



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం పీఎఫ్ ఖాతాదారులకు ఇటీవల గుడ్‌న్యూస్ చెప్పింది. పీఎఫ్ ఖాతాలో మీ వ్యక్తిగత వివరాలను సులభంగా అప్‌డేట్ చేసుకునే అవకాశం ఇచ్చింది. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) ఈ ప్రక్రియను క్రమబద్ధీకరించింది. ఆధార్ ద్వారా ధ్రువీకరించిన యూనివర్సల్ అకౌంట్ నంబర్లు (యూఏఎన్) ఉన్న సభ్యులు పత్రాలను అప్‌లోడ్ చేసే ఇబ్బంది లేకుండా వారి ప్రొఫైల్‌లను నవీకరించడానికి వీలు కల్పిస్తుంది. గతంలో మీ ఈపీఎఫ్ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేయాలంటే కచ్చితంగా మీ యజమాని ధ్రువీకరించాల్సి వచ్చేది. దీనివల్ల 28 రోజుల వరకు ఆలస్యం అయ్యేది.

మీ యూఏఎన్ మీ ఆధార్‌తో అనుసంధానించి ఉంటే మీరు మీ పేరు, పుట్టిన తేదీ, లింగం, జాతీయత, తల్లిదండ్రుల పేర్లు, వైవాహిక స్థితి, జీవిత భాగస్వామి పేరు, చేరిన తేదీ, నిష్క్రమించే తేదీతో సహా వివిధ వివరాలను నేరుగా అప్‌డేట్ చేయవచ్చు. మీ యూఏఎన్ అక్టోబర్ 1, 2017 కి ముందు జారీ చేస్తే ఏవైనా ప్రొఫైల్ అప్‌డేట్ చేయాలంటే ఇప్పటికీ యజమాని ఆమోదం అవసరం అని గమనించడం ముఖ్యం. అదనంగా ఆమోదాలు లేదా ఉపసంహరణలలో జాప్యాలను నివారించడానికి మీ ఆధార్, పాన్ మీ ఈపీఎఫ్ ఖాతాకు లింక్ చేయాలని నిపుణులు చెబుతున్నారు. ఈపీఎఫ్ఓ తీసుకున్న నిర్ణయంగా కోట్లాది మంది ఈపీఎఫ్ సభ్యులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈపీఎఫ్ఓ డేటా ప్రకారం దాదాపు 45 శాతం అప్‌డేట్ రిక్వెస్ట్ ఇక సెల్ఫ్ యాక్సెప్టెన్సీ పొందవచ్చు.

## పిల్లల భవిష్యత్‌తో పాటు బోలెడంత పన్ను ఆదా..

ఆ పథకాల్లో పెట్టుబడితో సాధ్యమే..!




**న్యూఢిల్లీ:** పిల్లల భవిష్యత్తు కోసం తెలివిగా పెట్టుబడి పెట్టడానికి వారి పొదుపులను పెంచడమే కాకుండా పన్ను బాధ్యతలను తగ్గించే వ్యూహాత్మక విధానం అవసరమని నిపుణులు చెబుతున్నారు. పెట్టుబడులను వైవిధ్యపరచడంతో పాటు పన్ను సమర్థవంతమైన ఎంపికలను ఉపయోగించడం వల్ల పెద్ద మొత్తంలో నిధులను పొదుపు చేయవచ్చని చెబుతున్నారు. ఈఈఈ, ఈక్విటీ-లింక్డ్ సేవింగ్స్ కింద వర్గీకరించబడిన పథకాలు గణనీయమైన పన్ను ప్రయోజనాలను అందిస్తాయి. ఆ పథకాల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమృద్ధి యోజన

ఈ రెండు పథకాలు ప్రభుత్వ మద్దతుతో వచ్చే అత్యంత సురక్షితమైన పథకాల్లో ఈ పథకాల్లో ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు అందుబాటులో ఉంటాయి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు మొత్తాలను మీ పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం నుంచి మినహాయించవచ్చు. ఉపసంహరణ తర్వాత అసలు మొత్తం, వడ్డీ రెండూ పన్ను మినహాయింపు పొందుతాయి. ఈ రెండు పథకాలు ఈ పెట్టుబడిగా ఉంటాయి. అయితే సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లలకు మాత్రమే వర్తిస్తుంది.

### నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్, పోస్ట్ ఆఫీస్ సేవింగ్ స్కీమ్

ఈ రెండు పథకాలు ఉపసంహరణపై వచ్చే వడ్డీపై పన్ను విధిస్తారు. అయితే పెట్టుబడిపై పన్నులను ఆదా చేయడానికి ఎన్ఎస్‌సీ ఆకర్షణీయమైన ఎంపిక అని నిపుణులు చెబుతున్నారు. సెక్షన్ 80సీ కింద మీరు 1.5 లక్షల వరకు మినహాయింపును క్లెయిమ్ చేయవచ్చు. మరోవైపు పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ ఖాతా ఒక ఆర్థిక సంవత్సరంలో వడ్డీలో 10,000 వరకు పన్ను మినహాయింపును అందిస్తుంది.

### ఈక్విటీ-లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్

మీరు పన్నులను ఆదా చేస్తూ మీ పెట్టుబడిని అధిక రేటుతో పెంచుకోవాలనుకుంటే ఈఎల్ఎస్ఎస్ ఫండ్‌లు మంచి మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్. ఇవి సెక్షన్ 80సీ కింద సంవత్సరానికి రూ.1.5 లక్షల వరకు పన్ను రాయితీని అందిస్తాయి. ఈఎల్ఎస్ఎస్‌లు అత్యధిక రాబడిని అందించే పెట్టుబడి ఎంపికల్లో ఒకటిగా ఉంటుంది.

# చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైన భారత్

నేడు న్యూజిలాండ్, భారత్ జట్ల మధ్య ఫైనల్

టీమిండియాకు 37 ఏళ్ల రికార్డు బ్రేక్ చేసే ఛాన్స్

న్యూజిలాండ్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్న టీమిండియా

అద్భుతమైన ఫామ్‌లో భారత కీలక ఆటగాళ్లు

విజయాలతో స్వారీ చేస్తున్న ఇండియా

ఛాంపియన్స్ ట్రోఫీలో రుసరుసగా మూడోసారి ఫైనల్‌లోకి అడుగు







**దుబాయ్:** నేడు దుబాయ్‌లో జరిగే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో అజేయ భారత్ బలమైన న్యూజిలాండ్‌తో తలపడనుంది. 8 జట్లు పాల్గొనే ఈ మెగా ఈవెంట్ దాదాపు 8 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కొత్త విజేతను పొందనుంది. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో పాకిస్తాన్ చేతిలో ఓడిపోయిన భారత్ వరుసగా రెండోసారి టైటిల్ గెలవలేకపోయింది. ఇదిలా ఉండగా, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్‌కు చేరుకోవడం భారత్ వరుసగా మూడోసారి, ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా ఇది నిలిచింది. రోహిత్ శర్మ, అతని బృందం ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఓడించగలిగితే, టీం ఇండియా చరిత్ర సృష్టిస్తుంది. భారత్ వర్సెస్ న్యూజిలాండ్ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ ఇరుజట్ల మునుపటి మ్యాచ్‌లో భారత్ 44 పరుగుల తేడాతో గెలిచింది. వరుసగా 3 విజయాలతో గ్రూప్ ఏలో అగ్రస్థానంలో నిలిచింది. సెమీఫైనల్లో వన్డే ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియాను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి భారత్ టైటిల్ మ్యాచ్‌కు చేరుకుంది. మరోవైపు, న్యూజిలాండ్ కరాచీలో డిఫెండింగ్ ఛాంపియన్ ఆతిథ్య పాకిస్థాన్‌పై విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత, వారు వరుసగా బంగ్లాదేశ్ విజయం, భారత జట్టుపై ఓటమిని ఎదుర్కొంది. సెమీ-ఫైనల్స్‌లో, బ్లాక్‌క్యాప్స్ దక్షిణాఫ్రికాను 50 పరుగుల తేడాతో ఓడించి, భారత్‌తో జరిగే టోర్నమెంట్ ఫైనల్‌కు చేరుకుంది. టోర్నమెంట్ విజేత కోసం ప్రపంచం ఎదురు చూస్తోంది. ఐసీసీ నాకౌట్ దశల్లో రెండు జట్ల మధ్య గత రికార్డులు న్యూజిలాండ్‌కు అన్ని ఫార్మాట్లలో స్పష్టమైన ఆధిక్యాన్ని ఇస్తున్నాయి. ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌లలో భారత్ వర్సెస్ న్యూజిలాండ్ రికార్డును మనం పరిశీలిస్తే, నాలుగు సార్లు తలపడ్డాయి. ఇందులో బ్లాక్‌క్యాప్స్ మెన్ ఇన్ బ్లూపై 3-1 ఆధిక్యంలో నిలిచింది. 2000 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్, 2019, 2023 ప్రపంచ కప్ సెమీ-ఫైనల్స్, 2021 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఉన్నాయి. భారత జట్టు సాధించిన ఏకైక విజయం ఇటీవలి మ్యాచ్ అయిన 2023 ప్రపంచ కప్ సెమీ-ఫైనల్‌లో వచ్చింది. 2000 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో క్రిస్ కైర్న్స్ చేసిన మ్యాచ్ విన్నింగ్ సెంచరీతో 265 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే మ్యాచ్‌లో భారత్‌ను ఓడించడం ద్వారా న్యూజిలాండ్ తొలి ఐసీసీ టైటిల్‌ను గెలుచుకుంది. 2021లో చరిత్రను పునరావృతం చేసింది. ఫైనల్‌లో భారతదేశాన్ని ఓడించి, రెండవ ట్రోఫీని గెలుచుకుంది. భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన 119 వన్డే మ్యాచ్‌లలో భారత్ 61 మ్యాచ్‌లలో విజయం సాధించగా, న్యూజిలాండ్ 50 మ్యాచ్‌లలో విజయం సాధించింది. ఒక వన్డే మ్యాచ్ టై కాగా, 7 మ్యాచ్‌లు ఫలితం లేకుండా ముగిశాయి. రాబోయే టైటిల్ పోరులో న్యూజిలాండ్‌ను ఓడించిన వెంటనే భారత జట్టు చారిత్రాత్మక ఘనతను సాధిస్తుంది. నిజానికి, ఇది భారతదేశానికి మూడవ ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్ అవుతుంది. ఈ ఐసీసీ ఈవెంట్‌ను మూడుసార్లు గెలుచుకున్న ప్రపంచంలోనే తొలి జట్టుగా అవతరిస్తుంది. మొదటిసారిగా, భారత జట్టు 2002లో శ్రీలంకతో కలిసి ఉమ్మడి విజేతగా ప్రకటించారు. ఆ తర్వాత, ఎంఎస్ ధోని కెప్టెన్సీలో, భారత జట్టు 2013 లో ట్రోఫీని అందుకుంది. ఇప్పటివరకు టోర్నమెంట్‌లో అత్యంత విజయవంతమైన జట్లు ఆస్ట్రేలియా, భారత్. ఇవి చెరో రెండు టైటిళ్లను గెలుచుకున్నాయి. 1988లో షార్జా కప్ ఫైనల్లో రవిశాస్త్రి నేతృత్వంలోని టీమిండియా 42 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ను ఓడించింది. ఆ తరువాత 2000లో సచిన్, గంగూలీ బ్యాటింగ్ లో అద్భుతంగా రాణించినా కివీస్ చేతిలో ఓటమి తప్పలేదు. 2005లో ముక్కోణపు వన్డే సిరీస్ లోనూ అదే సీన్ రిపీట్ అయింది. ఫైనల్లో కివీస్ చేతిలో భారత్‌కు ఓటమి తప్పలేదు. ఆపై చివరగా 2021 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్లో భారత్ ను ఓడించి కివీస్ టైటిల్ ఎగరేసుకుపోయింది. ఈసారి ఎలాగైనా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో కివీస్ పై విజయం సాధించి మూడున్నర దశాబ్దాల రికార్డును బ్రేక్ చేయాలని ఉవ్విళ్లూరుతోంది. విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, శుభమన్ గిల్ అద్భుతమైన ఫామ్ లో ఉండటం.. బౌలింగ్ లో షమీ, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి వికెట్ల వేట కొనసాగిస్తూ ఫైనల్ ఓటములకు కివీస్ మీద భారత్ ప్రతీకారం తీర్చుకునే ఛాన్స్ ఉంది. అక్షర్ పటేల్, రాహుల్ అవసరమైన పరుగులు చేస్తున్నారు. ఫైనల్లో రోహిత్ కనుక 20 ఓవర్ల వరకు నిలబడితే భారత్‌కు తిరుగుండదు. కాగా పిచ్ స్వభావం కాస్త క్రిటికల్ కావడంతో టాస్ కీలకం కావచ్చు. మ్యాచ్ గడిచే కొద్దీ పిచ్ తీరు మారుతుంటుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఫైనల్ మ్యాచ్ కావడంతో ఛాన్స్ తీసుకునే పరిస్థితి లేదు. అందుకే జట్టులో మార్పులు అవసరమని క్రీడా నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటి వరకూ ఎక్కువ మంది స్పిన్నర్లతో ఆడినట్టు ఈసారి ఆడకపోవచ్చు. మరో పేసర్ కమ్ ఆల్‌రౌండర్ అవసరముంది. అందుకే కుల్దీప్ యాదవ్ స్థానంలో వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం ఇవ్వాలని చాలామంది అభిప్రాయపడుతున్నారు. రవీంద్ర జడేజా, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, మొహమ్మద్ షమితో బౌలింగ్ విభాగం సిద్ధం కావచ్చు.

ఇక బ్యాటింగ్ ఆర్డర్ అలానే ఉండే అవకాశముంది. శుభమన్ గిల్ వరుసగా విఫమౌతుండటం కాస్త ఆందోళన కల్గిస్తోంది. అయితే ఒకసారి ఫామ్‌లో వస్తే అతనికి తిరుగుండదు. అందుకే ఫైనల్‌కు మరో అవకాశం ఇవ్వవచ్చు. ఇక రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ ఎప్పటిలానే అదే ఆర్డర్ కొనసాగిస్తారు. మిడిల్ ఆర్డర్‌లో కేఎల్ రాహుల్, అక్షట్ పటేల్ ఉండనే ఉంటారు. అంటే కేవలం బౌలింగ్ విభాగంలో ఒక్క మార్పు తప్ప మిగిలింది యధాతథంగా ఉండవచ్చు. అయితే దుబాయ్ పిచ్ స్పిన్ కు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో.. ఫైనల్ లో స్పిన్నర్లే కీలక పాత్ర పోషించే అవకాశముంది. స్పిన్నర్ల విషయంలో భారత్ కు దీటుగా ఉంది న్యూజిలాండ్. కాబట్టి రెండు జట్ల స్పిన్నర్ల మధ్య హోరాహోరీ పోటీ ఖాయమనేలా కనిపిస్తోంది. ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో నలుగురు స్పిన్నర్లలో బరిలోకి దిగింది టీమిండియా. అనువజ్ఞుడైన ఆల్ రౌండర్ జడేజా, క్రాఫ్టీ ఫింగర్ స్పిన్నర్ అక్షర్ పటేల్, మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, లెఫ్ట్ ఆర్మ్ ర్రిస్ట్ స్పిన్నర్ కుల్‌దీప్‌తో బలంగా ఉంది. ఇప్పటివరకు జరిగిన మ్యాచులన్నింటిలోనూ ప్రత్యర్థి జట్టు బ్యాటర్లను గట్టిగానే కట్టడి చేశారు మన స్పిన్నర్లు. అందుకే ఫైనల్ కోసం స్పిన్నే ప్రధాన అస్త్రంగా భారత జట్టు సిద్ధమైంది.

## ముంబై ఇండియన్స్‌కు ఎదురు దెబ్బ

గాయం నుంచి ఇంకా కోలుకోని బుమ్రా..

పలు మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం




**ముంబై:** ఐపీఎల్ 2025 ప్రారంభానికి ముందే ఐదుసార్లు చాంపియన్స్ ముంబై ఇండియన్స్ కు ఎదురు దెబ్బ తగిలేలా ఉంది. ఆ జట్టు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా.. గాయం నుంచి ఇంకా కోలుకోలేదని తెలుస్తోంది. గత జనవరిలో సిడ్నీలో జరిగిన ఐదో టెస్టులో గాయపడిన బుమ్రా.. అప్పటి నుంచి విశ్రాంతి తీసుకుంటున్నాడు. వెన్నునొప్పితో బాధపడుతున్న బుమ్రా.. బెంగళూరులోని ఎన్సీఏలో చికిత్స తీసుకుంటున్నాడు. అలాగే అక్కడే బౌలింగ్ ప్రాక్టీస్ కూడా మొదలు పెట్టాడు. అయితే ఏప్రిల్ నెల తొలి వారం వరకు బుమ్రా మెగాటోర్నీలో బౌలింగ్ చేసే అవకాశం లేదని తెలుస్తోంది. దీంతో ఫ్రాంచైజీ వర్గాలు కాస్త టెన్షన్ పడుతున్నాయి. నిజానికి బుమ్రా.. బీసీసీఐ మెడికల్ టీమ్ అండర్లో ఉన్నాడు. వాళ్లు అతనికి కాస్త కాస్త వర్క్ లోడ్ పెంచుతూ ఫుల్ ఫిట్ గా అయ్యేందుకు ట్రై చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుమ్రా.. పూర్తి స్థాయిలో ఫిట్ అయి మెడికల్ టీం నుంచి క్లియరెన్స్ వస్తేనే తను ఐపీఎల్లో బరిలోకి దిగుతాడని తెలుస్తోంది. వచ్చే జూన్ నుంచి ఇంగ్లాండ్ లో భారత్ సుదీర్ఘంగా పర్యటిస్తుంది. ఈ పర్యటనలో ఐదు టెస్టులు ఆడనుంది. 2027 ఐసీసీ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్లో చేరాలంటే ప్రతి మ్యాచ్ ఇంపార్టెంటే. ఈ నేపథ్యంలో భారత్ నుంచి ఇద్దరు పేసర్లు బుమ్రా, మహ్మద్ షమీ అందుబాటులో ఉండాలని బోర్డు భావిస్తోంది. కుదిరితే ఐదు మ్యాచ్ ల్లోనూ వీరు బౌలింగ్ చేయాలన టీమ్ మేనేజ్మెంట్ ఆలోచిస్తోంది. ఇప్పటికే షమీ ఫిట్నెస్ పై ఎప్పటికప్పుడు మెడికల్ టీమ్ ఫోకస్ పెడుతుండగా, బుమ్రా పై కూడా ఈ జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని తెలుస్తోంది. అలాగే ఐపీఎల్ 2025లో వర్క్ లోడ్ విషయంలోనే ఆయా ఫ్రాంచైజీలతో బోర్డు సంప్రదింపులు జరిపే అవకాశం ఉంది. క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఐపీఎల్ 2025 మరో రెండు వారాల్లో ప్రారంభమవనుంది. తొలి మ్యాచ్ లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో డిఫెండింగ్ చాంపియన్ కోల్ కతా నైట్ రైడర్స్ .. ఈనెల 22న కోల్ కతా లోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తలపడనుంది.

## కోహ్లీ ఐపీఎల్ టైటిల్ గెలుచుకోవాలని ఆకాంక్షిస్తున్నా

దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్




**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్, భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున కోహ్లీ ఐపీఎల్ టైటిల్ గెలుచుకోవడం, అతని అద్భుతమైన కెరీర్‌కు సరైన ముగింపు అవుతుందని అభిప్రాయపడ్డాడు. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి కోహ్లీ బెంగళూరు ఫ్రాంచైజీతో ఉన్నాడు. కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవడానికి ముందు 140 మ్యాచ్‌లకు నాయకత్వం వహించాడు. మొత్తం 252 మ్యాచ్‌ల్లో అతను 8,004 పరుగులు సాధించాడు, ఇందులో 8 సెంచరీలు, 55 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 36 ఏళ్ల కోహ్లీ, ఇప్పటికీ ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్. శిఖర్ ధావన్ (6,769 పరుగులు) రెండో స్థానంలో ఉన్నాడు. కానీ 17 సీజన్లుగా ఆడినా ఒక్క ఐపీఎల్ ట్రోఫీ కూడా గెలవలేకపోయాడు. 2009, 2011, 2016లో రన్నరప్‌గా నిలిచింది. ఇప్పుడంటే కాకపోయినా, 2025 ఐపీఎల్ ప్రారంభానికి ముందు, కోహ్లీ టైటిల్ గెలిచే అవకాశముందనే ఆశలు ఉన్నాయి. దీనిపై డివిలియర్స్ స్పందిస్తూ, కోహ్లీ మ్యాచ్‌ను ఫినిష్ చేసే సామర్థ్యం ఉందని, ఈ సారి టైటిల్ గెలవాలని తాను కోరుకుంటున్నానని చెప్పాడు. కోహ్లీ స్ట్రైక్ రేట్‌పై విమర్శలు ఎదుర్కొంటున్నప్పటికీ, డివిలియర్స్ మాత్రం అతని బ్యాటింగ్ విధానం సరైనదేనని చెప్పాడు. "కొన్నిసార్లు పరిస్థితుల ఆధారంగా కోహ్లీ నెమ్మదిగా ఆడాల్సి వస్తుంది. అయితే, అతనికి ఎదురుగా నమ్మదగిన బ్యాటర్ ఉంటే, అతను మరింత దూకుడుగా ఆడేందుకు అవకాశం ఉంటుంది" అని పేర్కొన్నాడు. "విరాట్ స్ట్రైక్ రేట్‌ను హాస్యాస్పదంగా విమర్శించారు. కానీ అతను ఇన్నింగ్స్‌ను మోస్తూ, తగిన సమయంలో వేగాన్ని పెంచాడు. అదే అతని ప్రత్యేకత," అని డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. ఈసారి ప్రదర్శన ఎలా ఉంటుందో చూడాలి. 2025 ఐపీఎల్ మార్చి 22న ప్రారంభం అవుతుంది.

## కేన్, మిచెల్ శాంట్నర్‌లతో జాగ్రత్త

దుబాయ్ పిచ్‌పై శాంట్నర్ బాగా ప్రభావం చూపిస్తాడు

రోహిత్ సేనకు దినేశ్ కార్తిక్ సూచన





**దుబాయ్:** గత కొద్ది రోజులుగా ఎంతో ఉత్కంఠగా సాగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీ పోరు తుది దశకు చేరుకుంది. ఈ క్రమంలో ఆదివారమే ఈ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ అట్టాహాసం గా జరగనుంది. ఇక దుబాయ్ వేదికగా జరగనున్న ఈ హైవోల్టేజీ మ్యాచ్‌లో భారత్, న్యూజిలాండ్ పోటీపడనున్నాయి. అయితే వరుసగా మూడోసారి ఫైనల్‌కు చేరిన టీమ్‌ఇండియా ఇప్పుడు ఎలాగైనా టైటిల్‌ను దక్కించుకోవాలనే కసితో బరిలోకి దిగనుంది. మరోవైపు, స్టార్ ప్లేయర్లతో న్యూజిలాండ్ టీమ్? బలంగా కనిపిస్తోంది. దీంతో మ్యాచ్ హోరాహోరీగా సాగడం ఖాయమంటూ క్రిడా విశ్లేషకులు అంటున్నారు. ఈ క్రమంలో టీమ్‌ఇండియా మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తిక్ తమ జట్టుకు కీలక సూచనలిచ్చాడు. న్యూజిలాండ్‌లోని కేన్ విలియమ్సన్, మిచెల్ శాంట్నర్‌లతో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించాడు. టోర్నీలో ఇప్పటివరకు భారత్ ఆధిపత్యాన్ని కొనసాగించిందని, అయితే న్యూజిలాండ్ మాత్రం తమ టాప్ ఆర్డర్‌ను ముఖ్యంగా విలియమ్సన్‌ను తక్కువ అంచనా వేయ్యొద్దంటూ పేర్కొన్నాడు. స్పిన్‌కు అనుకూలించే దుబాయ్ పిచ్‌పై శాంట్నర్ బాగా ప్రభావం చూపిస్తాడని, అతని బౌలింగ్‌లో టీమ్‌ఇండియా బ్యాటర్లు జాగ్రత్తగా ఆడాలని సూచించాడు. "నేను కేన్ విలియమ్సన్ విషయంలో చాలా ఆందోళన చెందుతున్నాను. ఎందుకంటే అతడు క్రీజులో పాతుకుపోయి మరీ మిడిల్ ఓవర్లలో చక్కగా బ్యాటింగ్ చేయగలడు. శాంట్నర్ నుంచి కూడా మనకు బాగానే ముప్పు ఉంది. దుబాయ్ పిచ్‌లు కూడా స్పిన్‌కు బాగా అనుకూలిస్తాయి. అందుకే శాంట్నర్ తన స్పిన్‌తో బ్యాటర్లకు అవకాశం ఇవ్వడు. వాళ్లను చాలా తెలివిగానే బోల్తా కొట్టిస్తాడు. అతడు మంచి కెప్టెన్ కూడా. విలియమ్సన్, టామ్ లేథమ్ వంటి పలువురు ప్లేయర్లపై కూడా తను ఎంతో నమ్మకం ఉంచాడు. న్యూజిలాండ్ టీమ్ కూడా చాలా బాగుంది. ఈ టోర్నమెంట్‌లో బెస్ట్ టీమ్ ఇదే. ఈ క్రమంలో భారత్ గెలవాలంటే అత్యుత్తమ జట్టైన న్యూజిలాండ్‌ను ఓడించాల్సి ఉంటుంది" అని దినేశ్ కార్తిక్ పేర్కొన్నాడు. ప్రెస్ ఎక్కువగా ఉండే నాకౌట్ మ్యాచ్‌ల్లో కివీస్‌కు మంచి రికార్డు చాలానే ఉందని డీకే మరోసారి గుర్తు చేశాడు. ఇదే ఛాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్ దశలో న్యూజిలాండ్‌ను ఓడించడం భారత్‌కు కలిసొచ్చే అంశమని ఆయన చెప్పుకొచ్చాడు.



# ఆపిల్‌ను ఎట్టిపరిస్థితిలోనూ.. ఇలా తినకండి



మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో తాజా పండ్లు కీలక పాత్ర పోషిస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా, కాలానుగుణంగా వచ్చే పండ్లను తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే శరీరాన్ని వ్యాధులు ప్రభావితం చేయకుండా నిరోధిస్తుంది. అందువల్ల, ప్రతిరోజూ ప్రకృతి నుండి వచ్చిన కనీసం ఒక పండు తినడం మంచిది. రోజుకు ఒక ఆపిల్ తింటే ఆరోగ్యంగా ఉంటారని ప్రజలు తరచుగా చెబుతారు. అయితే, ఆపిల్ తినేటప్పుడు తప్పనిసరిగా పాటించాల్సిన కొన్ని జాగ్రత్తలు ఉన్నాయి. అవెంటో ఇప్పుడు తెలుసుకుందాం..

## విత్తనాలు విషపూరితం..

* అన్నింటిలో మొదటిది, ఆపిల్‌ను తినడానికి ముందు బాగా కడగాలి. కొంతమంది ఆపిల్స్‌ను ఫ్రిజ్‌లో పెడతారు. కానీ ఇది మంచిది కాదు. మీరు ఒక ఆపిల్‌ను ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే, దానిని తీసిన ఐదు నిమిషాలలోపు తినాలి, లేకుంటే ఆపిల్ పోషక విలువ తగ్గిపోతుంది. కొంతమంది ఆపిల్‌తో పాటు విత్తనాలను కూడా తింటారు. కానీ, ఇది చాలా ప్రమాదకరం. ఎందుకంటే ఆపిల్ విత్తనాలు విషపూరితమైనవని శాస్త్రవేత్తలు అంటున్నారు.
* నిపుణుల ప్రకారం, 40 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి 15 నుండి 175 విత్తనాలను తింటే చనిపోవచ్చు. అదేవిధంగా, పది సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు 50 విత్తనాలను తింటే చనిపోవచ్చు. కాబట్టి, ఆపిల్ విత్తనాలతో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. కాబట్టి, ఆపిల్ తినేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ మీరు విత్తనాలను తినకూడదు.



# Yogaకి ముందు.. ఆ తర్వాత..!

**వ్యాయామానికి ముందు ఆహారం తీసుకున్నట్టే యోగా సాధనకు ముందు కూడా ఆహారం తీసుకోవచ్చు. ఆ పదార్థాలు ఏవంటే...**

* అవకాడో: పొటాషియం, మెగ్నీషియం మొదలైన ఖనిజ లవణాలు అవకాడోలో పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు శరీరంలోని కండరాలు, కణాల పనితీరును క్రమబద్ధీకరిస్తాయి. అంతేకాకుండా అవకాడో తేలికగా జీర్ణమవడంతో పాటు ఆకలిని కూడా అదుపులో ఉంచుతుంది. దీన్లోని ఆరోగ్యవంతమైన కొవ్వులు చెడు కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. ఇన్ని ఉపయోగాలున్నాయి కాబట్టి యోగ సాధనకు తగినట్టు శరీరం సహకరించడం కోసం అవకాడో తినాలి.
* అరటి పండు: దీన్లోని పొటాషియం నిల్వలను బట్టి ఎలాంటి వర్కవుట్‌కు ముందైనా తినదగిన పండుగా అరటిపండుకు పేరుంది. కడుపు ఉబ్బరం, కండరాల నొప్పులను అరటిపండు అరికడుతుంది. కాబట్టి యోగాకు ముందు అరటిపండును నేరుగా లేదా స్మూదీ రూపంలో తీసుకోవచ్చు.
* యాపిల్: ఇవి క్షార గుణం కలిగిన



పండ్లు. కడుపులో ఆమ్లత్వం ఏర్పడకుండా చేస్తాయి. సహజసిద్ధ చక్కెరలు, పీచు వీటిలో ఎక్కువ. విటమిన్ సి, నీరు కూడా వీటిలో ఎక్కువే కాబట్టి యోగసాధనలో దాహార్తిని అరికట్టగలుగుతాయి. విటమిన్ సి శరీరానికి చురుకుదనాన్ని అందించి, సాధనకు శరీరాన్ని సిద్ధం చేస్తుంది.
* బాదం: యోగాకు ముందు నాలుగు బాదం పప్పులు తింటే, శరీరానికి తక్షణ శక్తి సమకూరుతుంది. నీళ్లలో నానబెట్టినవి మినహా ఉప్పు జోడించినవి తినకూడదు. ఆర్గానిక్ బాదం పప్పుల్లో విటమిన్ ఇ, మెగ్నీషియం, ఆరోగ్యవంతమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి.

# నకిలీ కుంకుమ పువ్వుని గుర్తించండి ఇలా..!

తీపి పదార్థాలతోపాటు కొన్ని రకాల గ్రేవీల తయారీలో కుంకుమపువ్వును ఉపయో గిస్తుంటారు. కుంకుమ పువ్వు... ఘాటైన వాసనతో కొద్దిపాటి చేదు రుచితో ఉంటుంది. ఈ కారణంగానే ఆహార పదార్థాలకు ప్రత్యేక రుచి చేకూరుతుంది. నకిలీ కుంకుమపువ్వు వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉంటుంది. కొన్ని చిట్కాల ద్వారా నకిలీని గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఒక చిన్న గ్లాసు నీటిలో కుంకుమ పువ్వు రేకులు మూడింటిని వేసి కలపాలి. నీళ్లు వెంటనే రంగు మారితే అవి నకిలీవని గుర్తించాలి. నిజమైన కుంకుమపువ్వు రేకులు రంగు విడవడానికి చాలా సమయం తీసుకుంటాయి. ఇవి పాలు, నీళ్లు సహా ఏ ద్రవంలోనూ కరగవు.

కుంకుమ పువ్వు రేకులు ఎరుపు రంగులో ఉంటాయి. కానీ వాటిని ఆహార పదార్థాల్లో కలిపినప్పుడు లేత పసుపు రంగుని విడుస్తాయి. రేకులు వేసిన నీళ్లు లేదా పాలు ఎరుపు రంగులోకి మారినా రేకులు రంగు వెలిసి కనిపించినా అవి నకిలీవని తెలుసుకోవచ్చు.

రెండు రేకులను నోట్లో వేసుకుని నమిలితే నోరంతా చేదుగా అవుతుంది. అలా కాకుండా నాలుకమీద తీపిదనం తెలిస్తే అవి నకిలీవని గుర్తించాలి.

రేకులకు నిప్పు పెడితే అవి మండని పక్షంలో శుద్ధమైన కుంకుమ పువ్వుగా గుర్తించాలి. నకిలీ రేకులు వెంటనే మండిపోతాయి.





శుద్ధమైన కుంకుమ పువ్వు ...మట్టి, గడ్డి, తేనె వాసనల కలయికతో ఉంటుంది. నకిలీదానికి ఎటువంటి వాసన ఉండదు.

ఒక కప్పు నీటిలో రెండు కుంకుమ పువ్వు రేకులు వేసి పది నిమిషాలు నానబెట్టాలి. తరవాత ఈ రేకులను నీళ్లలో నుంచి తీసి వేళ్లతో నలిపితే అవి చిన్న ముక్కలు కాని పక్షంలో శుద్ధమైనవని గుర్తించాలి. రేకులు తెగిపోతుంటే మాత్రం నకిలీవని తెలుసుకోవచ్చు.

# ఫుల్‌టైమ్ టాలీవుడ్‌కి కేటాయిస్తున్న జాన్వీకపూర్

**టాకీస్:** రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా ఫ్యాన్స్ తలచుకుంటే ట్రెండింగ్‌కి కొదవా అన్నట్టుంది పరిస్థితి. నిన్నటి నుంచి ఏక్‌ధమ్ ట్రెండ్ అవుతూనే ఉన్నారు జాన్వీ కపూర్. ఇంతగా ట్రెండ్ కావడానికి బర్త్ డే సెలబ్రేషన్స్ మాత్రమే రీజనా.. అంటే.. సినిమా నుంచి వచ్చిన జాన్వీ లుక్ అదిరిందంటున్నారు అభిమానులు. ఆర్సీ 16 షూట్ కంప్లీట్ కాగానే అల్లు అర్జున్ - అట్లీ సినిమా యూనిట్‌తో జాయిన్ అవుతారట శ్రీదేవి తనయ. ఐకాన్ స్టార్ పక్కన అద్భుతమైన రోల్ కుదిరిందంటూ హ్యాపీగా



అదేంటి గురూ అలా అంటున్నారు.. నెక్ట్స్ టాలీవుడ్‌ని ఏలేది ఆ అమ్మాయే అని అంటున్నారు ఫ్యాన్స్. చుట్టమల్లే చుట్టేసింది మన జాన్వీ కపూర్. మొన్న మొన్నటిదాకా బాలీవుడ్‌కే పరిమితమైనా.. ఏనాడూ ఆమెని పొరుగమ్మాయిలా చూడలేదు మనవాళ్లు. తెలుగు సినిమాలు చేసేయ్ అమ్మా అని బుజ్జగిస్తూనే ఉన్నారు. ఆ మాటలు విన్న శ్రీదేవి తనయ దేవరతో ఎంట్రీ ఇస్తే సినిమా బ్లాక్‌బస్టర్ టాక్ తెచ్చుకుంది. దేవరలో జాన్వీని చూసి మా తంగం అనుకున్నారంతా. దేవర సెకండ్ పార్టు కోసం ఆల్రెడీ 2026లో కాల్షీట్ కేటాయించేశారు ఈ బ్యూటీ. ఇప్పుడు మాత్రం రామ్‌చరణ్ సినిమా షూటింగ్‌తో యమా బిజీగా ఉన్నారు. ఈ ఉన్నారట జాన్వీ. డ్యాన్సుల్లో బన్నీని ఈక్వెల్ చేయడానికి ఇప్పటి నుంచే కాసింత స్పెషల్‌గా శ్రద్ధ పెడుతున్నారట. తెలుగులో ఒకటికి మూడు సినిమాలు చేతిలో ఉన్నాయి జాన్వీకి. ముగ్గురు లీడింగ్ హీరోల మూవీస్‌లో చేస్తున్నారు. సో, అడపాదడపా బాలీవుడ్ మూవీస్ చేసినా, ఫుల్ టైమ్ తెలుగుకే అలాట్ చేసేయాలని ఫిక్స్ అయిపోయి నట్టున్నారు సిల్వర్‌స్క్రీన్ తంగం.





## మీ అంచనాలను అందుకోలేనుకుంటే
# నా సినిమా చూడొద్దు : నాని

**టాకీస్:** నా 16ఏళ్ల సినీ కెరీర్‌లో 'దయ చేసి ఈ సినిమా చూడండి' అని నేనెప్పుడూ అడిగింది లేదు. కానీ, ఈ చిత్ర విషయంలో ఆ మాట అడుగుతున్నా. ఎందుకంటే ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులెవరూ మిస్సవ్వకూడదని నా కోరిక. ఇది మీ అంచనాలను అందుకోలేదు అనిపిస్తే రెండు నెలల్లో విడుదల కానున్న నా 'హిట్ 3'ని ఎవరూ చూడొద్దు అని నాని అన్నారు. ఆయన సమర్పణలో ప్రియదర్శి ప్రధాన పాత్ర నటించిన చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. రామ్ జగదీశ్ తెరకెక్కించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. ఈ నెల 14న థియేటర్లలో విడుదల కానుంది. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ వేడుకలో ఈ చిత్ర ట్రైలర్‌ను నాని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి, నాగ్ అశ్విన్, ప్రశాంత్ వర్మ, శ్రీకాంత్ ఓదెల, శైలేశ్ కొలను, శౌర్యువ్ తదితరులు పాల్గొన్నారు. నాని మాట్లాడుతూ.. ఈ రోజుల్లో సినిమాల్లోకి దూరిపోయి.. అందులోని పాత్రలకు ఎమోషన్‌తో కనెక్ట్ అయిపోయి.. వాటితోపాటు నవ్వి, ఏడ్చి.. ఆ చిత్ర ప్రపంచం లోకి తీసుకెళ్లే కథలు బాగా తగ్గిపోయాయి. కానీ, అలాంటి అనుభూతిని 'కోర్ట్'తో నేను పొందగలిగా. ఇప్పుడా అనుభూతిని ప్రేక్షకులని పొందాలన్నది నా తాపత్రయం. ఎందుకంటే ఇలాంటి మంచి సినిమాని తెలుగు ప్రేక్షకులెవరూ మిస్సవ్వకూడదని నా కోరిక. అందుకే ఇంతగా బతిమలాడుతున్నా. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ మంచి సినిమా చూశామనే గర్వంతో బయటకు వస్తారు. ఇది మీ అంచనాల్ని అందుకోలేదు అనిపిస్తే మరో రెండు నెలల్లో విడుదల కానున్న 'హిట్ 3'ని ఎవరూ చూడొద్దు. ఇంతకంటే బలంగా నేనేమీ చెప్పలేను. ఎందుకంటే దీనికన్నా 10రెట్లు ఎక్కువగా 'హిట్ 3'పై ఖర్చు పెట్టా. ఈ నెల 14 వరకే 'ఈ సినిమా చూడమని అందరికీ చెప్తా. ఆ తర్వాత నుంచి మీరే ఆ మాట ప్రతి ఒక్కరికీ చెప్తారు" అన్నారు.

# ఆ బాధ ఇప్పటికీ ఉంది : చిరంజీవి



**టాకీస్:** నేడు మహిళ దినోత్సవం సందర్భంగా మెగా ఫ్యామిలీ అంతా ఒక్కదగ్గరే చేరింది. మెగా వుమెన్స్ పేరుతో ఒక ఇంటర్వ్యూలో విడుదల కాగా.. ఈ ఇంటర్వ్యూలో మెగాస్టార్ చిరంజీవితో పాటు అతడి అమ్మ అంజనాదేవి తమ్ముడు నాగబాబు, చెల్లెల్లు పాల్గొన్నారు. ఇందులో మెగా కుంటుంబంకి సంబంధించిన ఎన్నో విషయాలను చిరుతో పాటు అంజనాదేవి తదితరులు పంచుకున్నారు. అయితే ఈ ఇంటర్వ్యూలో చిరు మాట్లాడుతూ.. తన చెల్లి చనిపోయిన క్షణం ఇప్పటికీ గుర్తుకువస్తుందంటూ ఎమోషనల్ అయ్యాడు. అమ్మకు మేము ఐదుగురు సంతానం. అయితే మరో ముగ్గురు తోబుట్టువులు నా చిన్నతనంలోనే చనిపోయారు. నాన్న ఉద్యోగంలో బిజీగా ఉన్న సమయంలో అమ్మనే ఇంట్లో అన్ని పనులు చూసుకోవడంతో పాటు గృహిణిగా అన్ని బాధ్యతలు తన మీదే ఉండేవి. దీంతో చిన్ననాటి నుంచి తనకు సాయం చేసేవాడిని. అయితే నేను ఆరో తరగతి చదువుతున్న సమయంలో నాకు రమ అనే సోదరి ఉండేది. ఒకసారి సడన్‌గా జబ్బుపడింది. దీంతో నేను అమ్మ కలిసి తనను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాం. నాన్నకి ఈ విషయం తెలియదు. ఆసుపత్రిలో ఉండగానే రమ కన్నుమూసింది. దీంతో తనను చేతుల్లో ఎత్తుకుని ఇంటికి తీసుకెళ్లాను. ఇంటి చుట్టుపక్కల ఉన్నవారు సాయం చేయడంతో రమ అంతక్రియలు పూర్తి చేశాం. అయితే ఈ విషయం నాన్నకి తర్వాత తెలిసింది. తాను వచ్చేవరకు అంతా అయిపోయింది. కానీ ఆ క్షణాలు నాకు ఇప్పటికీ కూడా గుర్తున్నాయి వాటికి తలచుకున్నప్పుడల్లా ఎమోషనల్ అవుతుంటా అంటూ చిరు చెప్పుకోచ్చాడు.

# మెగా లావణ్య.. గోల్డెన్ లుక్‌తో స్టన్నింగ్



**టాకీస్:** లావణ్య త్రిపాఠి మరోసారి తన గ్లామర్‌తో నెట్టింట హీట్ పెంచేసింది. మెగా కోడలుగా మారిన తర్వాత ఆమె లైఫ్‌స్టైల్ మరింత హైలైట్ అవుతోంది. రీసెంట్‌గా ఆమె షేర్ చేసిన గోల్డెన్ గౌన్ ఫోటోలు వైరల్‌గా మారాయి. మెరుస్తున్న డిజైనర్ అవుట్‌ఫిట్‌లో స్టన్నింగ్ లుక్‌తో అదరగొట్టిన లావణ్య, తన అందంతో మైమరపించింది. గోల్డెన్ కలర్ గౌన్, డీప్ నెక్ డిజైన్, సాలిడ్ ఫిట్‌తో కటౌట్‌గా మెరిసిపోతూ ఫుల్ గ్లామ్ టచ్ ఇచ్చింది. మెగా ఫ్యామిలీలోకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత లావణ్య కెరీర్ కాస్త స్లో అయినా, సోషల్ మీడియాలో మాత్రం ట్రెండ్ అవుతూనే ఉంది. వరుణ్ తేజ్‌తో మ్యారేజ్ తర్వాత మరింత బ్యూటీఫుల్ లుక్స్‌తో కనిపిస్తూ, ఫ్యాషన్ గేమ్‌ని ఓ లెవెల్‌కి తీసుకెళ్లింది. తాజా ఫోటోషూట్‌లో ఆమె క్లాసీ మెకప్, వేవీ హెయిర్‌స్టైల్, స్మోకీ ఐ మేకప్‌తో రెడ్ లిప్‌స్టిక్ టచ్.. ఒక పర్ఫెక్ట్ గ్లామరస్ ఏంజెల్ లా తయారైంది. ఇక ఈ ఫోటోలను చూసిన నెటిజన్లు, అభిమానులు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. 'మెగా కోడలు స్టన్నింగ్, గోల్డ్ గర్ల్' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. ఇటీవల వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్'తో ప్రేక్షకులను ఆకట్టుకున్న లావణ్య.. ఇప్పుడు 'సతీ లీలావతి' సినిమాతో సిల్వర్ స్క్రీన్ పై సందడి చేయడానికి రెడీ అవుతోంది. భీమిలి కబడ్డీ జట్టు ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీపై మంచి అంచనాలున్నాయి. లావణ్య ఈ మూవీలో తన నటనతో మరోసారి మెప్పించేందుకు రెడీ అవుతోంది. అయితే లావణ్య తాజా గోల్డెన్ లుక్ చూసిన అభిమానులు ఆమె మరింత ఫ్యాషన్ ఫ్రీక్‌గా మారిందని అంటున్నారు. మరి ఈ కొత్త అవతార్‌తో ఆమె సినీ కెరీర్‌కి మళ్లీ జోష్ తెచ్చుకుంటుందా? వెయిట్ చేసి చూడాలి.

# ఉత్కంఠగా '23' టీజర్

## చుండూరు మారణకాండపై
## మల్లేశం దర్శకుడు మూవీ..

**టాకీస్:** మల్లేశం, 8 ఏఎమ్ మెట్రో వంటి ప్రయోగాత్మక చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడు రాజ్ రాచకొండ. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో రాబోతున్న మరో సంచలన చిత్రం 23. మన సమాజంలో చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందా.! అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమా రాబోతుంది. తేజ, తన్మయ, ఝాన్సీ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా.. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా నిర్మాణంలో ఓ సినిమా రూపొందుతోంది. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది. నేడు మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్.





ఈ టీజర్ చూస్తుంటే.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో 1991లో జరిగిన చుండూరు మారణకాండ ఘటనతో పాటు, 1993 చిలకలలూరిపేట బస్సు దహనం, 1997 హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన కార్ బాంబు దాడి ఘటనల ఆధారంగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ ఘటనలో చనిపోయిన వారి కథ ఒక లాగే ముగియగా.. ఈ ఘటనలకు పాల్పడిన హంతకుల కథ ఏం అయ్యింది అనే స్టోరీతో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది.

**టాకీస్:** తెలుగు సినిమాల్లో నటించేందుకు బాలీవుడ్ తారలు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రియాంకా చోప్రా, అలియాభట్, దీపికా పదుకొణె, జాన్వీకపూర్, అనన్యపాండే వంటి భామలు ఇప్పటికే తెలుగు సినిమాల్లో నటించి అలరించారు. ఇప్పుడు వీరి జాబితాలో సోనాక్షి సిన్హా చేరారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌లతో బీటౌన్‌లో హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు సోనాక్షి. ఇటీవల 'హీరామండి'తో అల రించిన ఆమె టాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యారు. సుధీర్‌బాబు హీరోగా నటిస్తోన్న 'జటాధర'తో ఆమె తెలుగులోకి అడుగుపెడుతున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం శనివారం పోస్టర్ విడుదల చేసింది. ప్రస్తుతం ఇది ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా సినిమాగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమవుతోంది. 'శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్స్‌కు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతి పొందుతారని సుధీర్‌బాబు తెలిపారు.

# జటాధరలో సోనాక్షి సిన్హా

